● సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు
● కార్పొరేషన్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యేలు ఆర్.మాధవి, పుత్తా చైతన్యరెడ్డి

కడప అభివృద్ధికి ప్రత్యేక నిధులు





కడప కార్పొరేషన్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, ఆర్.మాధవి

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 4: కడప నగర అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని సీఎం చంద్రబాబునాయుడును కోరామని కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి కూడా సానుకూలంగా స్పందించారని స్పష్టం చేశారు. గురువారం కార్పొరేషన్ సమావేశ మందిరంలో డిప్యూటీ మేయర్ ముంతాజ్‌బేగం అధ్యక్షతన కమిషనర్ ప్రవీణ్‌చంద్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 23 అంశాలతో కూడిన అజెండాను ప్రవేశపెట్టారు. వీటిలో 4, 13, 14, 15 అంశాలను పెండింగులో పెట్టి మిగతా వాటిని ఆమోదించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి పాల్గొనగా, తొలిసారిగా ఎక్స్ అఫిషియో సభ్యులుగా కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి హాజరయ్యారు. అజెండాలో పలు అంశాలు ర్యాటిఫికేసన్ ద్వారా ఆమోదం తెలపడంపై 47వ డివిజను కార్పొరేటరు పాకా సురేశ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. అత్యవసరమైతే తప్ప ర్యాటిఫికేషన్ చేయకూడదన్నారు. ప్రతి విషయం సభ్యులకు తెలియకుండా ర్యాటిఫికేషన్‌గా ఆమోదం చేయడం సరికాదన్నారు.

ర్యాటిఫికేషన్ చేయాల్సిన అవసరం ఏమొచ్చింది

● కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి

కార్పరేషన్‌లో కొన్ని తీర్మానాలకు ర్యాటిఫికేషన్ చేయాల్సిన అవసరం ఏమొచ్చింది. అలా అయితే సభ్యులెందుకు, చర్చలు ఎందుకని ఎమ్మెల్యే ఆర్.మాధవి మండిపడ్డారు. మేయర్ ఏకపక్ష నిర్ణయం తీసుకున్న తరువాత సభ్యులు ఆమోదం తెలపడం సరికాదన్నారు. సభ్యులందరూ స్థానికులేనని ఎప్పుడు పిలిచినా వచ్చే అవకాశం ఉందన్నారు. ఏదైనా సమస్య ఉంటే దానిపై సభ్యులందరితో చర్చిస్తే అప్పుడు ప్రజలకు మంచి జరిగే అవకాశం ఉంటుందన్నారు. తాను 1వతరగతి చదివే సమయంలో అప్సర సర్కిల్ ఏ విధంగా ఉందో ఇప్పుడు కూడా అదే స్థితిలో ఉందన్నారు. కడప నగరంలో అన్ని సర్కిల్స్ అభివృద్ధి జరుగుతోందని అప్సరా సర్కిల్ ఎందుకు చేయలేకపోతున్నారని ప్రశ్నించారు. త్వరలో అప్సర సర్కిల్ అభివృద్ధిపై కూడా దృష్టి సారించాలని సభ్యులను కోరారు. కడప నగరంలో పలు డివిజన్లలో శ్మశాన వాటికలు లేవన్నారు. నకాశ్‌లో అయితే శ్మశాన వాటిక ఉన్నప్పటికీ మురుగునీరు చేరి దయనీయంగా ఉందన్నారు. శ్మశాన వాటికల అభివృద్ధికి సభ్యులందరూ సహకరించాలని సూచించారు.



హాజరైన కార్పొరేటర్లు

అభివృద్ధిపై ఆరోగ్యవంతమైన చర్చ జరగాలి

● కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి

టీడీపీ ప్రభుత్వం వచ్చిందని, అభివృద్ధిపై ఆరోగ్యవంతమైన చర్చ చేసి కడప నగరాన్ని అభివృద్ధిపథంలో నడిపిద్దామని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి తెలిపారు. సమయం వృధా చేయకుండా ఎక్కడైనా నిధులు దుర్వినియోగం అయితే దానిపైన ప్రశ్నించాలని అన్నారు. ఇందిరానగర్‌లో పైపులైను కనెక్షన్ ఇచ్చినట్లయితే ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని త్వరలో దానిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే సర్వసభ్య సమావేశంలో తొలిసారి కార్పొరేటర్లు ధైర్యంగా ప్రశ్నించడం చాలా ఆనందంగా ఉందని చెప్పారు. ఇలా ప్రజా సమస్యలపై చర్చించి ఆరోగ్యవంతమైన నగరాన్ని నిర్మించుకుందామని పిలుపునిచ్చారు.

స్వపక్షంలో విపక్షం

తామెప్పుడూ స్వపక్షంలో విపక్షపాత్ర పోషిస్తామని కార్పొరేటర్లు పాకాసురేశ్, మగ్బుల్‌బాషా తెలిపారు. ప్రతి సర్వసభ్య సమావేశంలో ప్రశ్నిస్తూనే ఉన్నామన్నారు. అయితే దానిని సమగ్రంగా నిర్వహించడంలో అధికారులు స్పందించరని చెప్పారు.

తొలిసారి కార్పొరేటర్ల ఆవేదన గుర్తింపు

కార్పొరేషన్ ఏర్పడిన నాటి నుంచి ఎప్పుడూ కూడా కార్పొరేటర్లకు ప్రశ్నించే అవకాశం రాలేదు. ఏదో ఒకరిద్దరు మాట్లాడి సర్వసభ్య సమావేశాలు మమ అనిపించేవారు. ఎందుకంటే కడప కార్పొరేషన్ పరిధిలో ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు కాంగ్రెస్, వైసీపీ ప్రజాప్రతినిధులే అధికారంలో ఉండేవారు. మేయరు చెప్పిందే జరిగేది. ఒకరిద్దరు ప్రశ్నించినా దానికి స్పందన అంతంత మాత్రమే. తొలిసారి కడప, కమలాపురం నియోజకవర్గాల్లో టీడీపీ ఎమ్మెల్యేలు అధికారంలోకి వచ్చారు. సర్వసభ్య సమావేశంలోకి ఎక్స్‌అఫిషియో సభ్యులుగా హాజరయ్యారు. ఈ నేపథ్యంలో తొలిసారి కార్పొరేటర్ల ఆవేదనకు గుర్తింపు లభించిందని చెప్పాలి. కార్పొరేటర్లు వేసే ప్రశ్నలకు ఎమ్మెల్యేలుగా సంపూర్ణంగా సహకరించి అభివృద్ధిలో భాగస్వాములం అవుతామని స్పష్టం చేశారు.



ఎమ్మెల్యే మాధవి వర్సెస్ కార్పొరేటరు ఉమాదేవి

కడప సర్వసభ్య సమావేశంలో కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి, 49వ డివిజను టీడీపీ కార్పొరేటరు ఉమాదేవి మధ్య వాడివేడి చర్చ సాగింది. ఉమాదేవి మాట్లాడుతూ జూలై 1న జరిగిన పింఛన్ల పంపిణీని స్థానిక కార్పొరేటరుగా ఉన్న తనకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా తమ డివిజన్‌లో చేపట్టారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక సచివాలయంలో ప్రశ్నిస్తే ఎమ్మెల్యే పంపిణీ కార్యక్రమానికి హాజరవుతున్నారని, జిల్లా అధ్యక్షుడి సూచనతో రవిరెడ్డికి సమాచారం ఇచ్చామని సచివాలయ సిబ్బంది చెప్పారన్నారు. ఆ డివిజన్ కార్పొరేటరు ఉండగా రవిరెడ్డి ఎవరని ఉమాదేవి మండిపడ్డారు. దీనిపై ఎమ్మెల్యే మాధవి స్పందిస్తూ ఇది మా ఇంటిలో పండుగకాదని.. ఈ కార్యక్రమానికి ఎవరైనా రావచ్చన్నారు. ఎమ్మెల్యే వస్తుందని తెలిసి కూడా ఎందుకు రాలేదని ప్రశ్నించారు. 49వ డివిజను ఎవరి జాగీరు కాదు, అలాగే కడప నియోజకవర్గం కూడా ఎవరి జాగీరు కాదన్నారు. కార్పొరేషన్‌లో ఉన్న ఏ ఒక్క కార్పొరేటరుకు తాము సమాచారం ఇవ్వలేదని, అందులో మీరు కూడా ఒకరని.. మీరు రాలేదంటే ఆ తప్పు మీదేనని అన్నారు.

పాకా సురేశ్ మాట్లాడుతూ.. తాను ఇప్పటికి మూడుసార్లు కార్పొరేటర్‌నని, 2014, 2019లో కూడా తమకు ప్రభుత్వ కార్యక్రమం ఏదైనా ఉంటే ఎమ్మెల్యే సమాచారం ఇచ్చేవారని అన్నారు. పింఛన్ల పంపిణీ మంచి కార్యక్రమం అని, ఇది ప్రభుత్వ కార్యక్రమం కావడంతో ప్రోటోకాల్ ప్రకారం ఆయా డివిజన్లలో చేపట్టినప్పుడు అక్కడి కార్పొరేటర్లకు తప్పకుండా సమాచారం ఇవ్వాలన్నారు. కార్పొరేటర్లు వస్తారా లేదా అనేది తర్వాత వారి ఇష్టమన్నారు. కాగా.. తొలిసారిగా కార్పొరేషన్ సర్వసభ్య సమావేశానికి హాజరైన ఇద్దరు టీడీపీ ఎమ్మెల్యేలకు కార్పొరేటర్లు ఘనంగా స్వాగతం పలికారు. శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, కార్పొరేషన్ అధికారులతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ X వైసీపీ



● మార్కెట్ యార్డు చైర్మన్ పదవి నాదే
● మార్కెట్ యార్డుల్లో పనిచేస్తున్న 13 మందిని తొలగించండి
● కార్యదర్శికి మాజీ మార్కెట్‌యార్డ్ చైర్మన్ హుకుం
● వారిని తొలగిస్తే కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తాం
● ఫోన్‌లో ఎంపీ హెచ్చరిక
● సెలవులో వెళ్లిన కార్యదర్శి
● ఇదీ పులివెందులలో నేతల తీరు



కడప, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మా ప్రభుత్వం వచ్చింది. మళ్లీ నేనే మార్కెట్ యార్డు చైర్మన్. నేను చెప్పినట్లు వినాల్సిందే. వైసీపీ ప్రభుత్వంలో విధుల్లోకి తీసుకున్న 13 మందిని తొలగించాల్సిందే.. అంటూ పులివెందుల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తూగుట్ల రాఘవరెడ్డి మార్కెట్‌యార్డు కార్యదర్శికి హుకుం జారీ చేశారు. ఆ 13 మందిని తొలగిస్తే తాను మార్కెట్‌యార్డు కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగుతానని ఎంపీ అవినాశ్‌రెడ్డి ఫోన్ చేసి హెచ్చరించారు. దీంతో ఏం చేయాలో దిక్కుతోచక కార్యదర్శి సెలవులో వెళ్లిపోయారు. రెండు రోజుల క్రితం జరిగిన సంఘటన కాస్త ఆలస్యంగా వెలుగుచూసింది.

పులివెందుల, సింహాద్రిపురం మార్కెట్ యార్డుల్లో 13 మంది ఉద్యోగులు ఔట్‌సోర్సింగ్ కింద పనిచేస్తున్నారు. వీరిని వైసీపీ హయాంలో నియమించారు. ఇప్పుడు ప్రభుత్వం మారింది. టీడీపీ కొలువుదీరింది. జిల్లాలోనూ ఐదు అసెంబ్లీ స్థానాల్లో టీడీపీ గెలిచింది. ఈ నేపథ్యంలో మార్కెట్‌యార్డుల్లో ఉద్యోగాలపై టీడీపీ వారి కన్ను పడిందని అంటున్నారు.

వారిని తొలగించాల్సిందే..

అక్కడ పనిచేస్తున్న వారందరిని వెంటనే తొలగించాలని పులివెందుల మార్కెట్ యార్డు మాజీచైర్మన్ తూగుట్ల రాఘవరెడ్డి కొద్దిరోజుల క్రితం కార్యదర్శిని హెచ్చరించారు. వైసీపీ ప్రభుత్వంలో తీసుకున్న వారిని ఒక్క నిమిషం కూడా విధుల్లో ఉంచవద్దని వెంటనే తొలగించాలని కోరారు. కార్యదర్శి మాట్లాడుతూ.. ఆ ఉద్యోగుల విషయం తాను ఏమీ చేయలేనని సమాధానమిచ్చారు. వారిని విధుల్లోకి తీసుకున్నది తాను కాదని, ఔట్‌సోర్సింగ్ ద్వారా విధుల్లోకి తీసుకున్నారన్నారు. విధుల నుంచి తొలగించాలంటే కలెక్టర్ ఆదేశాలు అవసరం ఉంటాయని సమాధానమిచ్చారు. అయినా కూడా ఆయన, ఆయన అనుచరులు మరింత రెచ్చిపోయి వెంటనే తాము చెప్పినట్లు వినకపోతే నువ్వు కూడా ఇక్కడ ఉద్యోగం చేయలేవని కార్యదర్శిని హెచ్చరించారు. రెండురోజుల క్రితం మరోసారి ఇలానే బెదిరించారు.

తొలగిస్తే ఆందోళన చేస్తా..

ఇదిలా ఉండగా మరోవైపు కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి కార్యదర్శి రత్నరాజుకు ఫోన్ చేసి సింహాద్రిపురం, పులివెందుల మార్కెట్ యార్డుల్లో పనిచేస్తున్న 13 మందిని తొలగిస్తే మార్కెట్ యార్డు ఎదుటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అటువైపు అధికార పార్టీ టీడీపీ నేతల బెదిరింపులు. ఇటువైపు స్థానిక వైసీపీ ఎంపీ హెచ్చరిక. దీంతో కార్యదర్శికి ఏం చేయాలో అర్థం కాక దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు.

రేపటి నుంచి విధుల్లోకి రావద్దు

రాఘవరెడ్డి మరోఅడుగు ముందుకేసి మార్కెట్ యార్డులో పనిచేస్తున్న ఉద్యోగులను మంగళవారం పిలిచి రేపటి నుంచి విధులకు రావద్దని చెప్పారు. విధులకు వస్తే మార్కెట్ యార్డులో అడుగుపెట్టనిచ్చేది లేదని వారికి తెగేసి చెప్పారు. బుధవారం విధులకు వచ్చిన ఉద్యోగులను రిజిస్టర్‌లో సంతకాలు చేయలేనివ్వలేదని తెలిసింది. ఇదిలా ఉండగా మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి సోదరుడు ఈ విషయంలో కలుగజేసుకొని సింహాద్రిపురం మార్కెట్ యార్డులో పనిచేస్తున్న విషయం వీరికెందుకని వారి విషయంలో తలదూర్చాల్సిన అవసరం లేదని అన్నట్లు తెలిసింది. బుధవారం బీటెక్ రవి పీఏగా చెప్పుకునే ఓ వ్యక్తి సింహాద్రిపురం మార్కెట్‌యార్డుకు వెళ్లి అక్కడ పనిచేస్తున్న వారి వివరాలు, అధికారుల నెంబర్లు సేకరించి వెళ్లినట్లు తెలిసింది.

మాకు న్యాయ చేయండి

"పద్ధతి ప్రకారమే విధుల్లో చేరాము. అన్ని అర్హతలు ఉన్నాయి. ఆప్కాస్ ద్వారా వేతనాలు పొందుతున్నాం. మాకు న్యాయం చేయండి" అని మార్కెట్ యార్డుల్లో పనిచేస్తున్న ఉద్యోగులు కోరుతున్నారు. తమను మార్కెట్ యార్డుల్లోకి అడుగుపెట్టనివ్వడం లేదు, రిజిస్టర్లలో సంతకం చేయవద్దని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమను పని చేయనివ్వడం లేదని, ఉద్యోగాల నుంచి తొలగిస్తే కుటుంబాలు రోడ్డున పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు.

వారు ఫోన్ చేసింది వాస్తవమే

మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తూగుట్ల రాఘవరెడ్డి, ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి ఫోన్ చేసిన విషయం వాస్తవమే. నాపై ఒత్తిడి రోజురోజుకు పెరుగుతోంది. దీనితో పాటు నా వ్యక్తిగత కారణాల వల్ల కొన్నిరోజులు సెలవు పెట్టాను.

- రత్నరాజు, కార్యదర్శి, మార్కెట్ యార్డు, పులివెందుల

విద్యాసంస్థల బంద్ ప్రశాంతం

కడప (ఎడ్యుకేషన్), జూలై 4: దేశవ్యాప్తంగా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. గురువారం ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ, జీఆర్ఎస్‌వైఎఫ్, పీఆర్ఎస్‌టీఎఫ్, ఎస్ఎస్ఎస్ఎఫ్, పీఎస్ఎఫ్, ఏబీఎస్‌హెచ్, ఆర్‌వైఎఫ్, ఆర్ఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘ నాయకులు మాట్లాడుతూ దేశంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి భారతదేశ సహజ సంపదను కార్పొరేట్ పరం చేస్తోందన్నారు. చివరికి విద్యార్థుల ప్రతిభను అమ్ముకునే దిగజారుడు స్థాయికి చేరిందన్నారు. అందులో భాగంగానే నీట్ పరీక్షలు నిర్వహించిన ఎన్టీఏ సంస్థ ప్రశ్నాపత్రాన్ని లీక్ చేసి 67 మంది విద్యార్థులకు ఆలిండియా ఫస్ట్ ర్యాంకు వచ్చే విధంగా, 1506 మందికి పరీక్ష సమయపాలన తక్కువగా ఉందంటూ గ్రేస్ మార్కులు కలిపి చెప్పడం విడ్డూరంగా ఉందని తెలిపారు. నీట్ ఎగ్జామ్ రద్దు చేయడం సిగ్గుచేటన్నారు. వెంటనే ఎన్టీఏ సంస్థ లైసెన్సును రద్దు చేయాలని ఉన్నత విద్యాప్రమాణాలు కాపాడాలని, కేంద్ర విద్యాశాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా మూసివేసిన ప్రభుత్వ పాఠశాలలను తిరిగి కొనసాగించాలని, యూనివర్శిటీ కేంద్రాల్లో విద్యార్థులపైన క్రిమినల్ కేసులు వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. పీహెచ్‌డీ స్కాలర్లకు ఫెలోషిప్‌లు పెంచాలని మౌలానా ఆజాద్ నేషనల్ ఫెలోషిప్ కొనసాగించాలని అన్నారు. ఇప్పటికైనా బీజేపీ ప్రభుత్వం పునరాలోచన చేయాలని వైద్యరంగాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నేతలు గుజ్జుల వలరాజు, రాజేంద్ర, డీఎం ఓబులేసు, మామిళ్లబాబు, నాగేంద్రబాబు, చెన్నకేశవ, ప్రసన్నకుమార్, జగన్నాయక్, భాస్కర్, వేణు, మనోజ్, అభిరానంద్, అరుణ్, మస్తాన్, శివతేజ, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.



కడపలో విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో గంజాయి కలకలం

● విద్యార్థుల నుంచి 4గ్రాములు స్వాధీనం చేసుకున్న సెక్యూరిటీ

వేంపల్లె, జూలై 4: వేంపల్లె మండలంలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో బుధవారం రాత్రి విద్యార్థి వద్ద గంజాయి పట్టుబడింది. ఈ వ్యవహారం ఆలస్యంగా బయటకు వచ్చింది. ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థి సెలవులకు ఇంటికి వెళ్లి తిరిగి ట్రిపుల్‌ఐటీకి వచ్చాడు. కడపలో ఒకరి నుంచి తీసుకున్న గంజాయి ప్యాకెట్‌ను బ్యాగులో ఉంచుకుని వెళ్లాడు. సెక్యూరిటీ తనిఖీ చేయగా 4 గ్రాముల గంజాయి పట్టుబడింది. ట్రిపుల్‌ఐటీలోని మరో విద్యార్థి చెప్పినందున తెచ్చానని ఆ విద్యార్థి ట్రిపుల్‌ఐటీ సెక్యూరిటీ, అధికారులకు తెలిపినట్లు సమాచారం. సెక్యూరిటీ వారు గంజాయిని స్వాధీనం చేసుకొని ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త, ఏఓ రవికుమార్‌కు అందించారు. ఈ గంజాయి వ్యవహారంలో ముగ్గురు విద్యార్థులకు సంబంధం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా అధికారులు తెలియజేయడంతో వారు గురువారం ట్రిపుల్‌ఐటీకి వచ్చారు.

చట్ట విరుద్ధమైన పనులు చేసిన విద్యార్థులపై చర్యలు తీసుకునేందుకు ట్రిపుల్‌ఐటీ అధికారులు సిద్ధమై తల్లిదండ్రులకు తెలియజెప్పారు. గంజాయి పట్టుబడ్డ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు డైరెక్టర్ తెలిపారు. కాగా ఫిర్యాదు అందిన వెంటనే విచారించి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రంగారావు తెలిపారు.

అల్లూరికి ఘన నివాళి



కడప (క్రైం), జూలై 4: స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఘన నివాళులర్పించారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి ఎస్పీ పూలమాల వేసి నివాళులర్పించారు. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో అల్లూరి పాత్ర కీలకమైనదని, పరిమిత వనరులతో బ్రిటీషు వారిని గడగడలాడించిన పోరాటయోధుడన్నారు. ప్రజల హక్కుల కోసం, స్వాతంత్ర్యం కోసం బ్రిటీషు సామ్రాజ్యమనే మహాశక్తిని ఆయన ఢీకొన్నారన్నారు. చిన్నవయసులోనే బ్రిటీషు వారి తూటాలకు నేలకొరిగాడన్నారు. ఆయన స్వాతంత్ర్య సంగ్రామంలో చూపిన తెగువ, పట్టుదల ఆదర్శనీయమని, స్ఫూర్తిదాయకమని ఎస్పీ పేర్కొన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాల పేర

రూ.2కోట్ల ఇసుక స్కాం

● మూడు లేఅవుట్‌లకు తోలిన ఇసుక 1,26,432 టన్నులు
● 89,070 టన్నులకు స్కానింగ్ అయిన ఇసుక కూపన్లు
● 36,825 టన్నుల ఇసుకకు టాలీ కానీ కూపన్లు
● జేపీ వెంచర్స్ సంస్థతో హౌసింగ్ అధికారులు, సిబ్బంది కుమ్మక్కు
● లేఅవుట్‌లకు ఇసుక తోలినట్లు అక్రమంగా అప్లోడ్ చేసిన ఇన్వాయిస్‌లు
● ఇసుక కూపన్ల స్కానింగ్‌లో బయటపడ్డ అక్రమాలు
● ముగ్గురు ఏఈలకు నోటీసులతో సరి

ప్రొద్దుటూరు, జూలై 4: వైసీపీ ప్రభుత్వం చేపట్టిన జగనన్న కాలనీల్లోని ఇళ్ల నిర్మాణాల్లో అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. ముఖ్యంగా ఇళ్ల నిర్మాణాల కోసం జేపీ వెంచర్స్ సంస్థ జగనన్న కాలనీలకు తోలిన ఇసుకలో భారీగా అక్రమాలు చోటుచేసుకున్నాయి. ప్రొద్దుటూరులోని బొల్లవరం, రామేశ్వరం, మీనాపురం హౌసింగ్ లేఅవుట్‌లకు వేలాది టన్నుల ఇసుకను తోలకున్నా తోలినట్లు హౌసింగ్ అధికారులు జేపీ సంస్థవారితో కుమ్మక్కయి ఇన్‌వాయిస్‌లు అప్‌లోడ్ చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 1,26,432 మెట్రిక్ టన్నుల ఇసుక రవాణా చేసినట్లు ఇన్‌వాయిస్‌లు హౌసింగ్ అధికారులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయగా.. వాటికి సంబంధించి ఏడు నెలలుగా అధికారులు మల్లగుల్లాలు ఇంకా 36,825 టన్నుల ఇసుకకు కూపన్లు స్కానింగ్ కాలేదు. ఇళ్ల నిర్మాణాలే జరగకున్నా ఇసుక వినియోగించినట్లు కూపన్లు స్కానింగ్ చేస్తే తమ ఉద్యోగాలు పోతాయని అమినిటీస్ సెక్రటరీలు తేల్చి చెబుతున్నారు. దీన్ని బట్టి 36,825 టన్నుల ఇసుక స్కాం జరిగినట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఒక్కో టన్ను ఇసుక రూ.550తో లెక్కకట్టినా రెండు కోట్లకు పైగా ఇందులో అక్రమాలు జరిగినట్లు వెల్లడవుతోంది. ఈ ఇసుక స్కాం బయటికి రాకుండా హౌసింగ్ అధికారులు ఏడాదిగా తొక్కిపెట్టాలని ప్రయత్నిస్తున్నారు. కేవలం ఏఈలకు మూడుసార్లు మెమోలు ఇచ్చి చేతులు దులుపుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇసుకలోనే ఇంత స్కాం ఉంటే ఇంకా ఐరన్, సిమెంట్ ఇతరత్రా మెటిరియల్‌లో ఎంతగా నొక్కేశారో అనే విమర్శలు వినిపిస్తున్నాయి.

478.67 ఎకరాల్లో..

ప్రొద్దుటూరులోని రామేశ్వరం, బొల్లవరం, మీనాపురం లేఅవుట్‌లు కలిపి 478.67 ఎకరాల్లో ఏర్పాటు చేశారు. ఈ లేఅవుట్‌లలో మొత్తం 23,048 ప్లాట్లు ఉన్నాయి. రామేశ్వరంలో అర్బన్, రూరల్ కలిపి 7,647 ప్లాట్లు, బొల్లవరంలో అర్బన్, రూరల్ కలిపి 10,462 ప్లాట్లు, మీనాపురంలో అర్బన్ రూరల్ కలిపి 4,959.. మొత్తం 23,048 ప్లాట్లను పేదలకు పట్టాలిచ్చారు. ఈ మూడు లేఅవుట్‌లకు ఇప్పటివరకు పూర్తయిన ఇళ్లు 303 మాత్రమే. కానీ అయిన లెక్క చూస్తే మాత్రం అవాక్కు కాక తప్పదు. 141 కోట్ల 34 లక్షల 38వేల 66 రూపాయలు అయింది.

గత ఏడాది డిసెంబరులోనే వెలుగులోకి

గత ఏడాది డిసెంబరు 20 తేదీన 'జగనన్న కాలనీల్లో ఇసుక మేత' అనే కథనం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. నాటి నుంచి నేటివరకు ఆ స్కాంపై హౌసింగ్ అధికారులు కేవలం మెమోలు ఇచ్చి కాలయాపన చేస్తున్నారు. జరిగిన కుంభకోణంలో ఏఈలతో పాటు వర్కుఇన్‌స్పెక్టర్ల పాత్ర ఎంత ఉంది అని ప్రత్యేక విచారణ ఇంతవరకు చేపట్టలేదు. ఈ కుంభకోణంలో ఉన్న వారిని హౌసింగ్ ఉన్నతాధికారి ఒకరు వెనుక వేసుకు వస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆ ఉన్నతాధికారికి కూడా కమీషన్లు ముట్టినట్లు ప్రచారం జరుగుతోంది.

మెటీరియల్, సిమెంట్ కోసం వెళితే మామూళ్లు

ఇళ్ల నిర్మాణాలకు అవసరమయ్యే మెటీరియల్, సిమెంట్, స్టీల్ కోసం వెళితే ఒక ఏఈ సచివాలయ సిబ్బందిని డబ్బుల కోసం వేధిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. లేకుంటే బిల్లు లు సక్రమంగా పెట్టడంలేదని బెదిరిస్తున్నట్లు సమాచారం. వర్క్ ఇన్‌స్పెక్టర్లతో ఫోన్‌లు చేయించి ఇసుక కూపన్లు ఇవ్వమని అమినిటీస్ సెక్రటరీలను బెదిరిస్తున్నారని సచి వాలయ సిబ్బంది వెల్లడిస్తున్నారు. కొందరు కాంట్రాక్టర్లు కూడా ఆ ఏఈ పోన్ ఎత్తాలంటే భయపడుతున్నారు. ఎప్పుడూ మామూళ్లు ఇవ్వాలని ఒత్తిడి చేస్తారని లేకుంటే సహకరించరని ఆరోపిస్తున్నారు. ఆ ఏఈ లంచగొండితనం వల్ల ఇళ్ల నిర్మాణాలు ముందుకు సాగటం లేదని ప్రచారం సాగుతోంది.

ముగ్గురు ఏఈలకు షోకాజ్ నోటీసులు ఇచ్చాం..

ప్రొద్దుటూరులోని మూడు జగనన్న కాలనీ లేఅవుట్‌లలో జేపీ వెంచర్స్ వారు 1,26,432 మెట్రిక్ టన్నుల ఇసుక రవాణా చేసినట్లు ఇన్‌వాయిస్‌లను ఆన్‌లైన్‌లో హౌసింగ్ అధికారులు అప్‌లోడ్ చేశారు. అందులో ఇంకా 36,825 మెట్రిక్ టన్నుల ఇసుకకు కూపన్స్ టాలీ కాలేదు. ఎన్నిమార్లు హెచ్చరించినా ఫలితం లేదు. అందుకే ముగ్గురు ఏఈలకు షోకాజ్ నోటీసులు ఇచ్చాను. వారి సమాధానం బట్టి లెక్కతేలని 36,825 మెట్రిక్ టన్నుల ఇసుకకు సంబంధించి ప్రత్యేక విచారణ జరుపుతాం. అందులో ఎవరిపాత్ర ఉన్నా వారందరిపై వేటు తప్పదు.

- వి.రాజారత్నం, హౌసింగ్ ఈఈ

సస్పెండ్ అయి.. మళ్లీ అదే చోట పోస్టింగ్

గతంలో ఇక్కడ పనిచేసిన ఏఈ ఒకరు విధినిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా సిమెంటు గడ్డకట్టి లక్షలాది ప్రజాధనం వృధా అయింది. ఇందులో ఆయన సస్పెండ్ అయి వేరే జిల్లాలో కొంతకాలం పనిచేసి మళ్లీ అదే పోస్టులో ఇక్కడికి ఏఈగా వచ్చారు. మళ్లీ ఇక్కడ పోస్టింగ్ ఇవ్వడం వెనుక గత వైసీపీ ప్రభుత్వంలో పెద్దల సహకారం ఉంది. ఇసుక కుంభకోణంలో ఇదే ఏఈపై ఇప్పుడు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



బొల్లవరం లేఔట్‌లో జేపీ వెంచర్స్ అన్‌లోడ్ చేస్తున్న ఇసుక

'కాంట్రాక్ట్ మల్టీ పర్పస్'పై కరుణ చూపండి

- ఎన్నికలకు ముందు రెగ్యులర్‌కు గత ప్రభుత్వం చట్టం
- నిధి పోర్టల్ తెచ్చిన తిప్పలు..
- రోడ్డున పడిన కాంట్రాక్ట్ ఉద్యోగులు
- వీరికి రిటైర్మెంట్ వయస్సు 60 ఏళ్లేనా...



కడప(కలెక్టరేట్), జూలై 4: సుమారు 22 ఏళ్ల కిందట డీఎస్సీ ద్వారా కాంట్రాక్ట్ ఉద్యోగులుగా మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లు ఎంపికయ్యారు. రెగ్యులర్ విషయంలో గత ప్రభుత్వం ఎన్నికల ముందు చట్టం చేసింది. 2014కు ముందు ఉద్యోగాల్లో ఉన్న కొందరిని ఎట్టకేలకు రెగ్యులర్ చేసింది. అయితే వీరి రెగ్యులర్ విషయంలో నిధి పోర్టల్ తెచ్చి కాంట్రాక్ట్ ఉద్యోగుల వివరాలను మాత్రమే అప్‌లోడ్ చేసి చేతులు దులిపేసుకున్నారు. నిధి పోర్టల్‌లో ఆంక్షలు, మెలికల కారణంగా నోటికాడికి వచ్చిన ఉద్యోగాలు చేతికి అందక పోవడంతో ఉమ్మడి జిల్లాలో కొందరు ఉద్యోగుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది రాష్ట్రంలో కాంట్రాక్ట్ పారామెడికల్, ల్యాబ్ టెక్నీషియన్లు, ఎంపీహెచ్‌ఎస్‌లు, ఏఎన్ఎం ఉద్యోగాలు, వివిధశాఖల్లో దాదాపు 10117 మందికి కేవలం 3600 మందికి మాత్రమే రెగ్యులర్ చేయడం చూస్తే ఎన్నికల స్టంట్ అనే విషయం రూఢీ అవుతోంది. జిల్లాలో మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ ఉద్యోగాలు పొంది రెగ్యులర్ కోసం 35 మంది నిరీక్షిస్తుండడం గమనార్హం. మిగిలిన శాఖ కాంట్రాక్ట్ ఉద్యోగుల పరిస్థితి దయనీయం. దీంతో ఏళ్ల తరబడి చాలీచాలని జీతాలతో నెట్టు కొచ్చి, రిటైర్మెంట్‌కు దగ్గరలో ఉన్న తమకు ముఖ్యమంత్రి చంద్రబాబు కరుణ చూపాలని కాంట్రాక్ట్ ఎంపీహెచ్ఎస్ ఉద్యోగులు మొర పెట్టుకుంటున్నారు.

చట్టం ఉల్లంఘించి రెగ్యులరైజేషన్

గత ప్రభుత్వం కాంట్రాక్ట్ ఉద్యోగుల విషయంలో ఉదాసీనంగా వ్యవహరించి 30 యాక్టు తెచ్చింది. ఈ చట్టం ప్రకారం 2014కు ముందు డీఎస్సీ ద్వారా ఎంపికైన వారిని మాత్రమే రెగ్యులర్ చేయాలి. కానీ ఇక్కడ కూడా నిబంధనలకు పాతర వేశారు. 2014కు ముందు అనే మాటకు విలువ లేకుండా ఆతరువాత 2017 వరకు సెలెక్ట్ అయిన వారిని రాజకీయ పలుకుబడితో రెగ్యులర్ విషయంలో చట్టం ఉల్లంఘించి అనుయాయుల కోసం చక్రం తిప్పడంతో ఏళ్ల తరబడి రెగ్యులర్ కోసం నిరీక్షిస్తున్న ఉద్యోగుల కష్టాలకు కారణంగా చెబుతున్నారు. 2002 టీడీపీ చంద్రబాబు పాలనలోనే కాంట్రాక్టు ఉద్యోగాలు పొందాము. సాధారణ ఎన్నికల్లో కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పిస్తానని మేనిఫేస్టోలో పెట్టడం కొండంత ధైర్యం వచ్చిందన్నారు. జిల్లాలో ఎలాంటి కోర్టుల్లో, వివాదాలు లేని మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లను రెగ్యులర్ చేసే విషయంలో ఈ ప్రభుత్వం కరుణ చూపాలంటున్నారు.

గత ప్రభుత్వం చిన్న చూపు

2002 నుంచి కాంట్రాక్ట్, ఎన్ఎంఆర్ ఉద్యోగాలను డీఎస్సీ ద్వారా ఎంపిక చేశారు. వీరి రెగ్యులర్ విషయంలో లేని పోని ఆంక్షలు, గత ప్రభుత్వ విధానాల కారణంగా తమకు అన్యాయం జరిగిందంటున్నారు. రెండేళ్ల కిందట రెగ్యులర్ నోటిఫికేషన్ ద్వారా ఎంపికైన గ్రామ వార్డు సచివాలయ ఉద్యో గులను రెగ్యులర్ చేయగా, తమ విషయంలో గత ప్రభుత్వం ఎన్నికల కోడ్ సాకుతో నిధి పోర్టల్‌లో రెగ్యులర్ సమాచారం నమోదు చేయకుండా హోల్డ్‌లో పెట్టడంపై కాంట్రాక్ట్ ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా రిటైర్మెంట్ సర్వీసు 60 ఏళ్లకు కుదించడం పట్ల అసంతృప్తి వ్యక్తమౌతోంది.

పూర్వపు విధులు నిర్వీర్యం

గత ప్రభుత్వ పాలనలో గ్రామ, వార్డు సచివాలయాల రాకతో తాము గతంలో ప్రజలకు చేరువగా చేస్తున్న విధులకు మంగళం పాడిందని హెల్త్ అసిస్టెంట్లు వాపోతున్నారు. విధుల నిర్వహణలో గత ప్రభుత్వ నిర్ణయాలు గందరగోళ పరిస్థితులు తెచ్చిపెట్టాయంటారు. గతంలో 15 రోజులకు ఒకసారి ప్రతి ఇంటిని సందర్శించి మలేరియా, కుష్టు, టీబీ, ఎయిడ్స్ లాంటి 14 జాతీయ ప్రోగ్రాంలలో కీలకంగా పనిచేసే మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లకు 5,6 గ్రామ వార్డు సచివాలయాల బాధ్యతలను కట్టబెట్టారు. చాలీచాలనీ జీతాలతో పనిచేసే వీరిని యుద్ధప్రాతిపదికన (ఎమర్జెన్సీ సమయాల్లో) పనిచేసే విధంగా రీ డెప్లాయ్ మెంట్ పేరుతో జిల్లాలో ఇతర ప్రాంతాలకు బదిలీల చేయడంతో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయని చెప్పవచ్చు. ఇక ప్రతి 5000 మంది జనాభాకు ఒక హెల్త్ అసిస్టెంట్ పని చేయాలి. రీడిప్లాయ్‌మెంట్ పేరుతో అధిక పని భారం మోపడంతో మిగిలిన హెల్త్ అసిస్టెంట్ల భర్తీలు చేపడితే ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు చేరువవుతాయి.



ప్రభుత్వం కరుణించాలి

రాష్ట్రంలో కాంట్రాక్ట్ పారా మెడికల్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి. గత ప్రభుత్వంలో నిధి పోర్టల్ కారణంగా చాలా మది పేర్లు అప్‌లోడ్ జరగలేదు. వెంటనే అప్‌లోడ్ చేసి మల్టీపర్పస్ ఉద్యోగులు, అన్ని శాఖల వారిని రెగ్యులర్ చేయాలి. ఎన్డీఏ కూటమి, ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీల్లో భాగంగా తమకు ఉద్యోగ భద్రత, సంక్షేమ పథకాలు వర్తింప చేయాలి.

-కాంట్రాక్ట్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర కన్వీనరు యర్రపురెడ్డి

వ్యక్తి ఆత్మహత్య



ఓబులేసు మృతదేహం

ముద్దనూరు జూలై 4: మండల పరిధి చిన్నదుద్యాల గ్రామ సమీపంలోని మూత పడ్డ తార మిక్సింగ్ వద్ద వాచ్‌మెన్ గండి ఓబులేసు(45)ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ దస్తగిరి తెలిపారు. సీఐ సమాచారం మేరకు వివరాలిలా.. చిన్నదుద్యాల గ్రామానికి చెందిన ఓబులేసు నెల్లూరు తిరుపతిరెడ్డికి చెందిన మూతవేసిన తార మిక్సింగ్ ప్లాంట్ వద్ద వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ప్రతి రోజు రాత్రి ప్లాంట్ వద్దకు వెళ్లి పడుకొని ఉదయం ఇంటికి తిరిగివస్తాడు. బుధవారం రాత్రి ప్లాంట్ వద్దకు వెళ్లి గురువారం ఉదయం ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ప్లాంట్ వద్దకు వెళ్లి గది కిటికీలో నుంచి చూడగా ఫ్యాన్‌కు లుంగీతో ఉరివేసుకొని మృతి చెంది ఉన్నాడు. అయితే కొద్ది రోజుల క్రితం ప్లాంట్ వద్ద ఉన్న మోటర్లు చోరీకి గురి కావడంతో.. యజమానికి తెలిస్తే ఏమంటాడోనని భయంతో ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుని భార్య రేణుక తెలిపింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సీఐ తెలిపారు.

లారీల అద్దాలు ధ్వంసం - కేసు నమోదు



మైలవరం, జూలై 4: దాల్మియా పరిశ్రమ వద్ద తొమ్మిది లారీల అద్దాలను గుర్తు తెలియని వ్యక్తులు పగుల గొట్టారని ట్రాన్స్ పోర్టు మేనేజర్ కిరణ్ కుమార్ రెడ్డి ఫిర్యాదు చేశారు. పరిశ్రమ వద్ద లారెన్స్ ట్రాన్స్‌పోర్టుకు చెందిన లారీల అద్దాలను బుధ వారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పగుల గొట్టార న్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తలమంచిపట్నం ఎస్ఐ హనుమంతు తెలిపారు.

లారీల అద్దాల ధ్వంసం వైసీపీ వారి పనే

దాల్మియా పరిశ్రమ వద్ద ఓ ట్రాన్స్‌పోర్ట్ లోని 9 లారీల అద్దాల ధ్వంసం వైసీపీ నేతల పనేనని టీడీపీ నేతలు కర్నాటి తిరుపాల్‌రెడ్డి, ముని, అమర్‌నాథ్‌రెడ్డి ఆరోపించారు. గురువారం సాయంత్రం చిన్నకొమెర్ల గ్రామంలో వారు విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ అధికారం పోవడంతో ఆదాయం తగ్గుతుందన్న భయం, చేసిన అక్రమాలు బయటపడతాయన్న వణుకు వైసీపీ నేతల్లో కనిపిస్తోందన్నారు. దీంతో వైసీపీ నేతలు అక్రమాలకు, దాడులకు పాల్పడుతున్నారు. ట్రాన్స్‌పోర్టులోని లారీల అద్దాలను బుధవారం రాత్రి వారే పగులగొట్టి టీడీపీ నేతలు పగలగొట్టారని దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. అద్దాలు పగులగొట్టాల్సిన అవసరం లేదన్నారు. పోలీసులు దర్యాప్తు చేసి నిజానిజాలు బయటపెట్టాలని కోరారు.

లాడ్జిలో యువకుడు ఆత్మహత్య

కడప (క్రైం), జూలై 4 : కడప నగరం ఎర్రముక్కపల్లె సర్కిల్ సమీపంలోని లాడ్జిలో ఓ యువకుడు ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు కడప వన్‌టౌన్ సీఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. సీఐ వివరాల మేరకు.. తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా చెన్నారావుపేటకు చెందిన చీర రంజిత్ (25) రెండురోజుల క్రితం ప్రశాంత్‌రెడ్డి అనే స్నేహితుడి అక్క పెళ్లికి వచ్చాడు. లాడ్జిలో రూము తీసుకుని ఉంటున్నాడు. గురువారం ఉదయం లాడ్జిలో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి వద్ద సూసైడ్ లెటరు ఉందని.. అందులో అమ్మా నాన్న ఆశయాలను అందుకోలేకపోతున్నాను అంటూ రాసి ఉంది. ఆ సూసైడ్ లెటరును స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

వల్లూరు, జూలై 4 : కడప - తాడిపత్రి ప్రధాన రహదారిపై మండల పరిధిలోని తోళ్లగంగనపల్లె బస్టాపు సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. తోళ్లగంగనపల్లెకు చెందిన వెంకటరమణ ద్విచక్ర వాహనంలో వెళుతున్నాడు. అదే సమయంలో కడప నుంచి ఎర్రగుంట్ల వైపునకు బుడేరాం అనే వ్యక్తి మరో ద్విచక్ర వాహనంలో వెళుతూ ఢీకొట్టాడు. దీంతో ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు చికిత్స నిమిత్తం వారిని 108 వాహనంలో కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

వైద్యం అందడంలేదని సర్వజన ఆసుపత్రిలో ఆందోళన

- విద్యార్థులను వార్డులకు తిప్పుతున్నారంటూ తల్లిదండ్రులు ఆరోపణ
- మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్

కడప (సెవెన్‌రోడ్స్), జూలై 4: ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో గురువారం కాసేపు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. అనారోగ్యం పాలైన విద్యార్థులకు సరైన వైద్య సేవలు అందడంలేదని విద్యార్థుల తల్లిదండ్రులు వైద్యులు, వైద్యసిబ్బందితో గొడవకు దిగారు. వివరాలిలా.. కొద్దిరోజుల క్రితం ఖాజీపేట మండలం బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన బాలికలు అస్వస్థతకు గురయ్యారు. చికిత్స కోసం కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చేర్చారు. విద్యార్థులకు ఇక్కడ వైద్యసేవలందించి కొంత మందిని డిశ్చార్జి కూడా చేశారు. మరికొంత మందికి తీవ్రత తగ్గడంతో జనరల్ వార్డుకు తరలించారు. డిశ్చార్జి అయి వార్డుకు తరలించిన విద్యార్థులకు అస్వస్థత మళ్లీ తీవ్రం కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందారు. ఆసుపత్రిలో తమ పిల్లలకు సరైన వైద్యం అందడంలేదంటూ ఆసుపత్రి సీఎస్ ఆర్ఎంవోలు మరియు వైద్యులతో వాగ్వాదానికి దిగారు. విద్యార్థుల తల్లిదండ్రులకు వైద్యులు, సిబ్బంది సర్ది చెప్పారు. విద్యార్థులకు మరింత మెరుగైన సేవలందిస్తూ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని డాక్టర్లు, ఆర్ఎంవోలు విద్యార్థుల తల్లిదండ్రులకు సర్ది చెప్పారు. 26 మంది విద్యార్థులకు చికిత్సలందిసున్నారు. ప్రస్తుతం వార్డులో 20 పడకలు ఉంటే విద్యార్థుల తల్లిదండ్రుల కోరిక మేరకు అందరికీ ఒకేచోట చికిత్స అందించే ఉద్దేశ్యంతో అదనంగా మరో పది పడకలను ఏర్పాటు చేశారు.



ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులకు సర్దిచెబుతున్న ఆర్ఎంవో

పదే పదే రక్తం తీస్తున్నారు

- గీత, విద్యార్థి తల్లి



అనారోగ్యానికిగురైన పిల్లలకు పదే పదే పరీక్షల నిమిత్తం రక్తం తీస్తున్నారు. అనుభవం లేని వైద్యులు వచ్చి అనేక సార్లు సూదులతో గుచ్చి గుచ్చి రక్తం తీస్తున్నారు. నొప్పితో పిల్లలు బాధపడుతున్నారు. రక్తపరీక్షలకు రక్తనమూనాలతో వెళితే రక్తం సరిపోదు మరింత తీసుకురండి అని పదే పదే తిప్పుతున్నారు. సిబ్బంది విసుక్కుంటున్నారు. రోజులు గడుస్తున్నా పిల్లల్లో మార్పులు కనిపించడంలేదు. విద్యార్థులు ఇంకా అస్వస్థతోనే ఉన్నారు. పరీక్షల కోసం అటు ఇటూ ఎక్కువగా తిరగాల్సివస్తోంది.

పరామర్శించడానికి ఎవరూ రాలేదు

- స్వర్ణ, విద్యార్థిని తల్లి



ఇంత మంది పిల్లలు అనారోగ్యానికి గురై చికిత్స పొందుతుంటే ఏ అధికారి కానీ, నాయకుడు కానీ పరామర్శించడానికి రాలేదు. పిల్లలను అస్వస్థతకు కారణమైన స్కూలు అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. స్కూలు నుంచి ఏ అధికారి వచ్చి పిల్లలు ఎలా ఉన్నారని అడగలేదు. ఇంత మంది పిల్లలకు ఇలా ఉంటే.. జిల్లా అధికారులు పట్టించుకోవడం లేదు.

మెరుగైన వైద్యం అందిస్తున్నాం

- డాక్టర్ యాదవేంద్రరెడ్డి, జనరల్ మెడిసిన్, హెచ్‌వోడి

విద్యార్థులకు కలుషిత నీటి వల్ల వైరల్ డయేరియా సోకింది. వాంతులు, అధికంగా విరేచనాలు వీటి ప్రధాన లక్షణం. విద్యార్థులకు ఓఆర్ఎస్, సెలైన్ ద్వారా మందులు అందిస్తున్నాం. తీవ్రత తగ్గిన విద్యార్థులను జనరల్‌వార్డుకు తరలించాం. అందరూ ఒకే చోట ఉండాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఆశిస్తున్నారు. వార్డు సామర్థ్యం 20పడకలు మాత్రమే. మెరుగైన వైద్యం అందించి కొంతమందిని డిశ్చార్జి కూడా చేశాం. వైద్య బృందం నిరంతరం విద్యార్థుల ఆరోగ్య స్థితి చూస్తూనే ఉన్నారు. చాల వరకు విద్యార్థులు కోలుకున్నారు.

అదనపు పడకలు ఏర్పాటు చేశాం

డాక్టర్ శ్రీనివాసులు, సీఎస్ఆర్ఎంవో, సర్వజన ఆసుపత్రి, కడప

విద్యార్థులు అస్వస్థతకు గురి కావడంతో తల్లిదండ్రులు ఆందోళన చెంది వైద్యసేవలు అందడం లేదని కాసేపు ఆందోళన చేశారు. వారి మానసిక ఆందోళన అర్థం చేసుకుని అందరూ ఒకే చోట ఉండే విధంగా మరో పది అదనపు పడకలు ఏర్పాటు చేశాం., విద్యార్థులకు నిరంతరం వైద్యులు, వైద్యసిబ్బంది పర్యవేక్షణలో వైద్యం అందిస్తున్నాం. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. విద్యార్థులు త్వరగా కోలుకుంటారు. వారికి ప్రత్యేక డైట్ (ఆహారం) కూడా పంపిస్తున్నాం.

విద్యుత్ తీగలు తగలి యువకుడు మృతి



మృతి చెందిన రమణ

వీరబల్లి, జూలై 4: మండలంలోని తాటిగుంటపల్లి పంచాయతీ పిచ్చికుంటపల్లికి చెందిన కత్తి రమణ (29) అనే యువకుడు అడవి జంతువుల కోసం తీసిన విద్యుత్ తీగలు తగులుకుని షాక్‌కు గురై మృతి చెందారు. గ్రామస్థులు, పోలీసుల కథనం మేరకు.. బుధవారం గ్రామానికి చెందిన పలువురు పశువులకు మేతకు వెళ్లి తిరిగి రాకపోవడంతో పిచ్చికుంటపల్లికి చెందిన ముగ్గురు కలిసి వాటిని వెతకడానికి అడవికి వెళ్లారు. అక్కడ తాటిగుంటపల్లెకు చెందిన రామ్మోహన్‌రెడ్డి, మోటకట్ల బాబులు అడవి జంతువుల కోసం విద్యుత్ తీగలు తీయడంతో.. కత్తి రమణ వాటికి తగులుకుని షాక్ గురై మృతి చెందాడు. ఈ విషయం పోలీసులకు తెలపడంతో ఏఎస్ఐ వెంకటేశ్వర్లు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి వివరాలు సేకరించారు. కత్తి రమణకు సంవత్సరం క్రిం వివాహం కాగా, ఇటీవలే కుమారుడు పుట్టాడు. చిన్న వయస్సులోనే రమణ ఆకస్మిక మృతితో భార్య, బిడ్డ అనాధలయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. మృతదేమాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ప్రభుత్వాసుత్రికి తరలించినట్లు తెలిపారు. కాగా, కత్తి రమణ మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు పేర్కొన్నారు.

9 మందిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు

ఒంటిమిట్ట, జూలై 4: మండల పరిధిలోని చిన్న కొత్తపల్లెలో మూడు రోజుల క్రితం ద్విచక్రవాహనంపై వెళుతున్న ట్రాక్టర్ డ్రైవర్ జయరామయ్య అదే గ్రామానికి చెందిన తమ్మిశెట్టి వర్దన్ మధ్య ద్విచక్ర వాహనం విషయంలో ఘర్షణ చోటు చేసుకుంది. అక్కడే ఉన్న స్థానికులు ఇరువురికి సర్దిచెప్పి సమస్యను పరిష్కరించారు. అనంతరం రాత్రి సమయంలో తన బంధువులు, స్నేహితులతో కలిసి చిన్నకొత్తపల్లె గ్రామంలో ఉన్న జయరామయ్య ఇంటిపై దాడి చేయడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. జయరామయ్య తన ఇంటిపైకి మారణాయుదాలతో దాడి చేయడంతో పాటు కులం పేరుతో దూషించాడని ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై విచారణ చేపట్టిన పోలీసులు తమ్మిశెట్టి వర్దన్‌తో పాటు మరో 9 మందిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధుసూదన్‌రావు తెలిపారు.

రెడ్డిపల్లె చెరువు కట్టపై ప్రమాదం...ఇద్దరు మృతి

- మృతుల ఇద్దరు భార్యలు గర్భిణులు



ప్రమాదంలో మృతి చెందిన వెంకటేశ్వర, సుబ్బరాయుడు

ఓబులవారిపల్లె, జూలై 4: కడప - చెన్నై జాతీయ రహదారి రెడ్డిపల్లె చెరువుకట్ట వద్ద లారీ - సుమోను ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. వివరాల్లోకి వెళితే.. పుల్లంపేట మండలం రెడ్డిపల్లె అరుంధతీవాడకు చెందిన రెడ్డిపాప వెంకటేశ్వర(25), రాజంపేట మండలం ఆకేపాడు పంచాయతీ రేణింతలకు చెందిన వెలకచర్ల సుబ్బరాయుడు(25)లు ఓబులవారిపల్లె నుంచి రెడ్డిపల్లెకు వస్తుండగా రాజంపేట నుంచి వస్తున్న లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందారు. వెంకటేశ్వర ఓబులవారిపల్లెకు చెందిన వ్యక్తి వద్ద డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఏడాది క్రితం పెళ్లి కాగా.. అతని భార్య నిండు గర్భిణి, శుక్రవారం డెలివరికీ వెళ్లాల్సి ఉందని.. రాత్రి సమయంలో ఏదైనా అత్యవసరం ఏర్పడుతుందని తాను పనిచేస్తున్న యజమాని నుంచి సుమోను తీసుకుని ఇంటివద్ద పెట్టుకోవడానికి వస్తున్న సమయంలో లారీ రూపంలో మృత్యువు వచ్చి తీసుకుపోయిందని భార్య, కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. అతనికి తోడుగా ఉన్న మరో వ్యక్తి సుబ్బరాయుడుకు కూడా గతయేడాది వివాహం కాగా అతని భార్య కూడా ఐదు నెలల గర్భిణి. ప్రమాద విషయం తెలుసుకున్న వెంటనే పోలీసు సిబ్బందితో ఎస్ఐ చిన్నపెద్దయ్య ఘటన స్థలానికి చేరుకున్నారు. ట్రాఫిక్‌ను అదుపు చేసి నుజ్జు నుజ్జు అయిన వాహనాన్ని పక్కకు తీసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రైల్వేకోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అంతర్‌రాష్ట్ర దొంగ అరెస్ట్

- రూ.2,26,898 విలువగల సెల్‌ఫోన్‌లు స్వాధీనం

చీరాలటౌన్, జూలై 4 : రైళ్లల్లో సెల్‌ఫోన్‌లు దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర దొంగను చీరాల జీఆర్‌పీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ కొండయ్య తెలిపిన వివరాల ప్రకారం కడప జిల్లా ముద్దనూరు మండలం పెనికలపాడుకు చెందిన ఇల్లూరు హరినాథ్‌రెడ్డి ఏరోనాటికల్ ఇంజనీరింగ్ పూర్తిచేసి ఖాళీగా ఉంటున్నాడు. ఉద్యోగం లేకపోవడంతో మద్యం, ఆన్‌లైన్ బెట్టింగ్ వంటి వ్యసనాలకు బానిసగా మారాడు. ఈక్రమంలో రైళ్లల్లో దొంగతనాలకు అలవాటు పడ్డాడు. ఇదిలావుండగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 4వ నెంబర్ ప్లాట్‌ఫాంపై తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించాడు. దీంతో హరినాథ్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని విచారణ చేయగా దొంగతనాలకు పాల్పడిన వివిధ కంపెనీలకు చెందిన 6 సెల్ ఫోన్‌లు అప్పగించాడు. వాటి విలువ సుమారు రూ.2,26,898 ఉంటుందని తెలిపారు. స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో హెల్ప్‌లైన్ సెంటర్

ప్రొద్దుటూరు టౌన్, జూలై 4: ఇంజనీరింగ్, అగ్రికల్చరల్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశించే విద్యార్థులకు ఆన్‌లైన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించడానికి వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు హెల్ప్‌లైన్ సెంటర్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ కేవీ రమణయ్య తెలిపారు. ఈనెల 4వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరుగుతుందన్నారు. విద్యార్థుల సెల్‌ఫోన్లకు వచ్చే మెసేజ్‌లను గమనించి ఏవైనా సందేహాలు ఉంటే హెల్ప్‌లైన్ సెంటర్‌లో నివృత్తి చేసుకోవాలని సూచించారు.

వైవీయూలో ఫైన్‌ఆర్ట్స్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు

కడప (ఎడ్యుకేషన్), జూలై 4: వైవీయూ లలిత కళల విభాగంలో నాలుగు సంవత్సరాల బ్యాచ్‌లర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌కోర్సుల ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ విభాగం అధిపతి మృత్యుంజయరావు తెలిపారు. ఈ కోర్సుల ప్రవేశానికి ఇంటర్మీడియట్ ఏ గ్రూపులో ఉత్తీర్ణత అయినా అర్హులని తెలిపారు. ప్రభుత్వ ప్రైవేటు రంగంలో ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ నెల 10లోపు వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని, వివరాలకు 9010014304 నెంబరుకు సంప్రదించాలన్నారు.

రామాలయంలో కౌలు కోసం టెండర్లు

ఒంటిమిట్ట, జూలై 4: ఒంటిమిట్ట కోదండరామాలయం అధీనంలో ఉన్న వ్యవసాయ భూముల కౌలు కోసం గురువారం టీటీడీ, రెవెన్యూ అధికారులు టెండర్లను నిర్వహించారు. మండలంలో రెవెన్యూ పరిధిలోని 342, 753, 896/1, 1147, 1153, 1169, 1835, 81, 86, 925/3 సర్వేనంబర్లలోని కోదండరామాలయం ఆధీనంలో ఉన్న భూములకు సంవత్సరం కౌలు కోసం టెండర్లను ఆహ్వానించారు. గురువారం ఉదయం నుంచి టీటీడీ పరిపాలన భవనంలో టెండర్లు ప్రక్రియ చేపట్టారు. పూర్తి వివరాలను త్వరలో వెల్లడిస్తామని టీటీడీ ఇన్‌స్పెక్టర్ నవీన్ తెలిపారు.

పాత విధానంలోనే పంటల బీమా

పులివెందుల టౌన్, జూన్ 4: పాత విధానంలోనే పంటలబీమా అమలు జరుగుతుందని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం అమరావతిలో వ్యవసాయ శాఖ కమిషనర్ హరికిరణ్‌ను కలిసి ఆయన మాట్లాడారు. రైతులకు మేలు జరిగే విధంగా పంటల బీమా విధానాన్ని రూపొందించాలని కోరారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఈ ఖరీఫ్ నుంచే పాత విధానం ప్రారంభమవుతుందని, రైతులే స్వయంగా బ్యాంకులు లేదా ఆర్బీకేల ద్వారా బీమా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. జూలై 31లోపు ప్రీమియం చెల్లించాలన్నారు. బ్యాంకులలో రుణాలు తీసుకున్న వారు ఆదే బ్యాంకులో ప్రీమియం కట్టే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఒక వేళ సమయాభావం వల్ల వీలుకాకపోతే వ్యవసాయశాఖ ద్వారా దరఖాస్తులు తీసుకుంటారని, నోటిఫైడ్ చేసిన అన్ని పంటలకు బీమా కట్టుకోవచ్చన్నారు. గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వంలో ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులకు మళ్లీ మంచి రోజులు వచ్చాయని ఎమ్మెల్సీ తెలిపారు.

70 చౌక బియ్యం బస్తాలు పట్టివేత

చెన్నూరు, జూలై 4: మండల పరిధిలోని శివాలపల్లె వద్ద 70 బస్తాల చౌక బియ్యాన్ని చెన్నూరు తహసీల్దారు కార్యాలయ సిబ్బంది గురువారం పట్టుకున్నారు. శివాలపల్లె గ్రామ సమీపంలో గురువారం మధ్యాహ్నం అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా బియ్యం బస్తాలు ఉన్నట్లు తెలియడంతో రెవెన్యూ సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకుని వాటిని స్వాధీనం చేసుకున్నారు. బుధవారం 202 బస్తాల బియ్యాన్ని పట్టుకున్న పోలీసులు బియ్యం అక్రమ రవాణాపై దృష్టిసారించారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ సిబ్బందికి పక్కా సమాచారం రావడంతో పట్టుకున్నారు. కాగా, మండలంలో బియ్యం అక్రమ రవాణా ఇటీవల ఎక్కువగా జరుగుతుందన్న సమాచారం పదే పదే రావడంతో వాటిపై దృష్టి సారించినట్లు రెవెన్యూ సిబ్బంది తెలిపారు. డీలర్లు కూడా బియ్యం పక్కదారి పట్టనీయకుండా కార్డుదారులకు కచ్చితంగా పంపిణీ చేయాలని తహసీల్దారు ప్రకాశ్‌బాబు తెలిపారు. ఏ చౌకదుకాణంపై ఫిర్యాదు రాకూడదన్నారు.

కొండూరువాసి కువైత్‌లో మృతి



పెంచలయ్య (ఫైల్)

అట్లూరు, జూలై 4: మండలంలోని కొండూరు వాసి అయిన గంపా పెంచలయ్య (55) గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన బంధువుల వివరాల మేరకు.. పెంచలయ్య జీవనోపాధి కోసం ఏడాది కిందట కువైట్‌కు వెళ్లాడు. బుధవారం సాయంత్రం బిల్డింగు పని చేస్తుండగా హఠాత్తుగా గుండెపోటు రావడంతో పక్కనే పనిచేస్తున్న సహచరులు కువైట్‌లోని హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మరణించారని కుటుంబీకులు తెలిపారు. పెంచలయ్యకు భార్య, ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. పెంచలయ్య మృతదేహాన్ని శుక్రవారం సొంత ఊరైన కొండూరుకు తరలిస్తారని బంధువులు తెలిపారు.

ఘర్షణలో ఇద్దరికి గాయాలు

కొండాపురం, జూలై 4: పట్టణంలోని సచివాలయం సమీపంలో ఓ ఇంటి వద్ద జరిగిన ఘర్షణలో గురువారం ఇద్దరికి గాయాలయ్యాయి. ఇంటి వద్ద మూత్ర విసర్జన విషయంలో వెల్లాల రామలింగారెడ్డి, అతని తల్లి విజయలక్ష్మి, చంద్రఢబుళరెడ్డి ఘర్షణ పడ్డారు. ఈ సంఘటనలో విజయలక్ష్మి, చంద్రఢబుళరెడ్డికి గాయాలైనట్లు కొండాపురం ఎస్ఐ యోగీంద్ర తెలిపారు. కేసు నమోదు చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు

● రాజకీయ భీష్మాచార్యుడు రోశయ్య: తులసిరెడ్డి

వేంపల్లె, జూలై 4: స్వర్గీయ అల్లూరి సీతారామరాజు విప్లవజ్యోతి అని, స్వర్గీయ కొణిజేటి రోశయ్య రాజకీయ భీష్మాచార్యుడని మాజీ రాజ్యసభ సభ్యులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తులసిరెడ్డి కొనియాడారు. గురువారం వేంపల్లెలో అల్లూరి సీతారామరాజు 127వ జయంతిని, కొణిజేటి రోశయ్య 91వ జయంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ విశాఖ మన్యం ప్రాంతంలో గిరిజనులపై ఆంగ్లేయుల ప్రభుత్వం సాగిస్తున్న రాజకీయ, ఆర్థిక, సామాజిక, ధన, మాన, ప్రాణ దోపిడీకి వ్యతిరేకంగా అల్లూరి సాయుధ పోరాటం చేశారన్నారు. ఈ పోరాటంలో 27 సంవత్సరాల చిన్న వయసులో ఆంగ్లేయుల తుపాకుల తూటాలకు బలియై అమరజీవి అయ్యాడన్నారు. అలాగే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల గవర్నరుగా స్వర్గీయ రోశయ్య ఎనలేని సేవ చేశారన్నారు. ఆయన గొప్ప ఆర్థికవేత్త, 16సార్లు రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆర్థిక మాంత్రికుడన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ టి సుబ్రమణ్యం, ఉత్తన్న, బాలం సుబ్బరాయుడు, వినయ్ పాల్గొన్నారు.

నేటి యువతరానికి ఆదర్శం అల్లూరి: డీఆర్వో

కడప(కలెక్టరేట్), జూలై 4:స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు నేటి యువతరానికి ఆదర్శమని జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో స్టెప్, పర్యాటక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్‌తో పాటు స్టెప్ సీఈఓ సాయి గ్రేస్, డీటీసీ మీరా ప్రసాద్, డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్, జిల్లా సాంస్కృతిక, పర్యటకా శాఖాధికారి మల్లికార్జున అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఆర్వో గంగాధర్ గౌడ్ మాట్లాడుతూ నేటి తరానికి అల్లూరి సీతారామరాజు ఆదర్శనీయమన్నారు. అల్లూరి ధైర్య సాహసాలు ప్రతి ఒక్కరూ స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సాయుధ పోరాటం ద్వారానే స్వాతంత్ర్యం వస్తుందని నమ్మి అందుకోసం తన ప్రాణాలర్పించిన యోధుడన్నారు. తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని చాటుకున్న విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు అన్నారు. 21 ఏళ్ల ప్రాయంలోనే బ్రిటీష్ సామ్రాజ్యం అనే మహా శక్తిని ఢీకొట్టి వీరమరణమం పొందిన మన్యం వీరుడు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఓ వెంకట్రావు, సాంఘిక, సంక్షేమ శాఖ డీడీ సరస్వతి, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.





అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఆర్వో గంగాధర్ గౌడ్... నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ రాజేశ్‌కుమార్‌రెడ్డి

అల్లూరిది ప్రత్యేక స్థానం : ఇన్‌చార్జి డీన్ అరుణ

పులివెందుల రూరల్, జూలై 4: స్వాతంత్ర్య పోరాటంలో తన ప్రాణాలను తృణప్రాయంగా విడిచిన అల్లూరి సీతారామరాజుకు ప్రజల్లో ప్రత్యేక స్థానం ఉందని ఆహార శాస్త్ర, సాంకేతిక కళాశాల ఇన్‌చార్జి అసోసియేట్ డీన్ అరుణ పేర్కొన్నారు. గురువారం స్థానిక కళాశాలలో అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆయనకు ఘననివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరపోరాటంలో హక్కుల సాధనకు ప్రజలలో పోరాట జ్వాలను నింపిన మన్యంవీరుడిగా పేరొందారన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో అల్లూరి సీతారామరాజు పాత్ర కీలకమైందన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పోరాట పటిమ అందరికీ స్ఫూర్తిదాయకం అన్నారు. అధ్యాపకుల డాక్టర్ జయమ్మ, డాక్టర్ రా జేష్, డాక్టర్ కీర్తిరెడ్డి, డాక్టర్ సాయిశ్రీనివాస్, డాక్టర్ జాకీర్ బాషా, డాక్టర్ రాశేఖర్, కె.సుబ్బారెడ్డి, ఎన్.వి.సుబ్బారెడ్డి, కళాశాల సిబ్బంది కవిత, సుధారాణి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగుజాతి తెగువకు నిలువెత్తు నిదర్శం

కడప (ఎడ్యుకేషన్), జూలై 4 : తెలుగుజాతి తెగువకు నిలువెత్తు నిదర్శనమైన యన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జీవితం తరతరాలకు స్ఫూర్తిదాయకమని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ఆర్ట్స్ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ రిజిస్ట్రారు ఎన్.రాజేశ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. యూనివర్సిటీలో గురువారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు నిర్వహించారు. ముందుగా అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేటి సమాజానికి అల్లూరి సీతారామరాజు ధైర్యసాహసాలు ఆదర్శనీయమన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన మహనీయుల త్యాగాలను మరువరాదని అన్నారు. ఎన్ఎస్ఎస్ అధికారులు ఈవెంట్ కో ఆర్డినేటర్ మనోహర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



అల్లూరి సీతారామరాజు, రోశయ్యకు నివాళులర్పిస్తున్న తులసిరెడ్డి

వైవీయూ ఆధ్వర్యంలో...

వైవీయూ ఆధ్వర్యంలో రిజిస్ట్రారు ప్రొఫెసరు ఎస్.రఘునాథరెడ్డి అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మన్యం ప్రజల హక్కులు, స్వాతంత్ర్యం కోసం పోరాడి 20 ఏళ్ల వయసులోనే ప్రాణ త్యాగం చేసిన అల్లూరి జీవితం ప్రతి ఒక్కరూ చదవాలన్నారు.

మాజీ ఎమ్మెల్సీని కలిసిన శివకొండారెడ్డి

కడప (ఎడ్యుకేషన్), జూలై 4 : ఎమ్మెల్సీగా నామినేషన్ వేసిన నేపథ్యంలో పి.రామచంద్రయ్యను కడప టీడీపీ నగర అధ్యక్షుడు సానపురెడ్డి శివకొండారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే ఆయనకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో ప్రేమ్‌కుమార్, రవిశంకరరెడ్డి పాల్గొన్నారు.



రామచంద్రయ్యను సన్మానిస్తున్న దృశ్యం

ప్రత్యేక విద్యుత్ అదాలత్‌లో సమస్యలు పరిష్కరించుకోండి

● మండల విద్యుత్ ఏఈ సుబ్రమణ్యం

సింహాద్రిపురం, జూలై 4: పులివెందుల డివిజన్ పరిధిలో శుక్రవారం జరిగే ప్రత్యేక విద్యుత్ అదాలత్‌లో సింహాద్రిపురం మండల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు కూడా ఏమైనా సమస్యలు వుంటే పరిష్కరించుకోవచ్చని మండల విద్యుత్ ఏఈ సుబ్రమణ్యం గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పులివెందుల మినీ సెక్రటేరియేట్‌లోని సమావేశమందిరంలో శుక్రవారం ఉదయం 11-30 గంటల నుండి మధ్యాహ్నం 1-30 గంటల వరకు ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక విద్యుత్ అదాలత్ కమిటీ ఛైర్‌పర్సన్ రిటైర్డ్ జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి, కమిటీ సభ్యులు, ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థకు చెందిన అధికారులు హాజరవుతారన్నారు. వినియోగదారుల యొక్కపరిష్కారం కాని సమస్యలు వ్రాత పూర్వక ఫిర్యాదు ద్వారా తెలియబరచి వారి సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. మండల విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏఈ సుబ్రమణ్యం కోరారు.

ప్రతి ఒక్కరూ చట్టాలను తెలుసుకోవాలి

పులివెందుల రూరల్, జూలై 4: ప్రతి ఒక్కరు చట్టాలను తెలుసుకోవాలని జిల్లా లీగల్ ప్రొబేషన్ ఆఫీసర్ సునీతరాజు, సీఐ మద్దిలేటి, సీడీపీఓ శ్రీలత పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో అంగన్వాడీ వర్కర్లు, మహిళా పోలీసులకు భారత న్యాయ సంహిత వంద రోజుల యాక్షన్‌ప్లాన్‌లో భాగంగా ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన చట్టాలు ఈనెల 1వ తేదీ నుంచే అమలులోకి వచ్చాయన్నారు. వీటిని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షులు రాజు, అంగన్వాడీ సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న మద్దిలేటి

చంద్రబాబు పాలనలోనే దివ్యాంగుల జీవితాలకు వెలుగు

● వీహెచ్‌పీఎస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు ఈశ్వరమ్మ

కడప (మారుతీనగర్), జూలై 4: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు పాలనలోనే దివ్యాంగుల జీవితాలకు వెలుగులు సాధ్యమని వీహెచ్‌పీఎస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు పి.ఈశ్వరమ్మ అన్నారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి మహిళా కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక 49వ డివిజన్ ఆలంఖాన్‌పల్లెలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గత ప్రభుత్వ పాలనలో దివ్యాంగులకు మూడు వేల రూపాయల పెన్షన్ తప్ప బ్యాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీ పట్ల దృష్టి సారించిన పాపాన పోలేదన్నారు. దీంతో దివ్యాంగులు తీవ్ర మనోవేదనకు గురయ్యారన్నారు. రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం విజయం సాధించగానే దివ్యాంగులకు మంచిరోజులు వచ్చినట్లేనన్నారు. సమావేశంలో వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు మాతయ్య, పెన్షన్‌దారులు దేవి, చెన్నమ్మ, గంగమ్మ, రాధిక, సాలమ్మ, అంజనమ్మ, ఓబులమ్మ, నాయకులు నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

'మధ్యాహ్న భోజన పథకం కార్మికురాలిపై దాడి అమానుషం'

కడప (నాగరాజుపేట), జూలై 4 : మధ్యాహ్న భోజనం పథకం కార్మికురాలు సుంకమ్మపై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని సీఐటియు జిల్లా అధ్యక్షులు కామనూరు శ్రీనివాసులురెడ్డి అన్నారు. నగరంలోని విద్యుత్ భవనం ఆవరణంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతపురం జిల్లా వజ్రకరూరు మంలం, చాయాపురం ఎంపీపీ స్కూలు నందు మధ్యాహ్న భోజనం పథకం ప్రారంభించిన 2003 సంవత్సరం నుండి సుం కమ్మ అనే కార్మికురాలు పనిచేస్తుందన్నారు. నెలల తరబడి బిల్లులు పెండింగులో ఉన్నా తక్కువ వేతనం ఇస్తున్నా 23 ఏళ్లుగా పిల్లలకు వండి పెడుతుందన్నారు. ఆమెపై అధికార పార్టీ నాయకులు దాడి చేయడం దుర్మార్గమన్నారు. దీంతో సుంకమ్మ పురుగుల మందు తాగిందని ప్రస్తుతం ఆమె గుంతకల్లు ప్రభుత్వ హాస్పిటల్‌లో చికిత్స పొందుతుందన్నారు. ఆమెపై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆమెను యదాతథంగా పనిలో కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో సీఐటియు విద్యుత్ యూనియన్ రాష్ట్ర నాయకులు నాయబ్ రసూల్, జిల్లా నాయకులునాగసుబ్బయ్య, నాగమల్లయ్యవెంకటేశ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులురెడ్డి

మానవాళి ఉజ్వల భవిష్యత్తుకు సహకార సంఘాలు

కడప(కలెక్టరేట్), జూలై 4: సర్వమానవాళి ఉజ్వల భవిష్యత్తు నిర్మాణంలో సహకార సంఘాలు అనే అంశానికి ప్రాధాన్యతనివ్వాలని జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ పేర్కొన్నారు. అంతర్జాతీయ సహకార దినోత్సం సందర్భంగా కలెక్టరేట్‌లోని తన చాంబరులో జాయింట్ కలెక్టర్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి జి. సుభాషిణి, డీసీసీబీ సీఈఓ రాజమణి, ప్రొద్దుటూరు సీటీసీ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సహకార దినోత్సవ పోస్టరు ఆవిష్కరణ

కడప (ఎన్టీఆర్ సర్కిల్), జూలై 4 : అంతర్జాతీ సహకార దినోత్సవ పోస్టర్లను జేసీ గణేశ్‌కుమార్ ఆవిష్కరించారు. అంతర్జాతీయ సహకార దినోత్సవం గత సంవత్సరం జూలై మొదటి శనివారం నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ క్రమంలో 102వ అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని ఈ నెల 6న నిర్వహించనున్నారు. సర్వమానవాళి ఉజ్వల భవిష్యత్తు నిర్మాణంలో సహకార సంఘాలు అనే అంశానికిప్రాధాన్యత ఇవ్వనున్నారు. పోస్టర్ల ఆవిష్కరణలో జిల్లా సహకార శాఖ అధికారి సుభాషిణి, డీసీసీ బ్యాంకు సీఈవో రాజామణి, కో ఆపరేటివ్ ట్రైనింగ్ సెంటరు ప్రిన్సిపల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక విద్యుత్ అదాలత్

పులివెందుల రూరల్, జూలై 4: శుక్రవారం ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తుననట్లు ఏపీఎస్పీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై.శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఛైర్ పర్సన్ వి.శ్రీనివాస ఆంజనేయ మూర్తి (రిటైర్డ్‌జడ్జి), ఆర్థిక సభ్యులు కె.రామమోహన్‌రావు, సాంకేతిక సభ్యులు ఎస్.ఎల్. అంజనీకుమార్, స్వతంత్ర సభ్యులు జి.ఈశ్వరమ్మ హాజరవుతారన్నారు. పట్టణంలోని మినీ సెక్రటేరియట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారుల తమ సమస్యలను రాత పూర్వకంగా తెలియజేసి పరిష్కరించుకోవాలని కోరారు.

రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై నిరసన

వేంపల్లె, జూలై 4: ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ లోక్‌సభలో సభా సాంప్రదాయాలు పాటించకుండా హిందువులపై చేసిన అనుచిత వ్యాఖ్యలకి వ్యతిరేకంగా హిందూ ఐక్యవేదిక నాయకులు వేంపల్లెలో నిరసన తెలిపారు. గురువారం వేంపల్లెలోని అడ్డరోడ్డులో నిరసన తెలిపారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు సుష్మ మాట్లాడుతూ ప్రజల సమస్యలపై పోరాడకుండా లేని సమస్యలను సృష్టిస్తున్నారన్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి సునీల్‌కుమార్, హిందూ ఐక్యవేదిక నాయకులు దొంతుసుమన్, వినోద్‌కుమార్, దివాకర్ తదితరులుపాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న హిందూ ఐక్యవేదిక నాయకులు

మినుము పంటను పరిశీలించిన వ్యవసాయాధికారులు

కమలాపురం రూరల్, జూలై 4 :మండలంలోని టి.చదిపిరాళ్ల గ్రామంలో సహాయ వ్యవసాయ సంచాలకులు ఏవీ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో సాగు చేసిన మినుము పంట పొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలాల్లో మినుము పంటలో రబ్బరు పురుగు మరియు తెల్లదోమ, పచ్చదోమ పురుగులు ఆశిస్తున్నాయని ఆ పురుగులు ఆకులపై సంచరిస్తూ నష్టం కలుగజేస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు మమత, గ్రామ రైతులు పాల్గొన్నారు.



మినుము పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటా : ఎమ్మెల్యే



గజమాలతో ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న టీడీపీ నేతలు

పెండ్లిమర్రి, జూలై 4: ప్రజలకు ఎల్లవేళల అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తానని ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి తెలిపారు. మండలంలోని పాతగిరియంపల్లె గ్రామంలో గురువారం టీడీపీనాయకుడు ఉమాశంకర్‌రెడ్డి ఏర్పాటుచేసిన విందుకు ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు టీడీపీ నాయకులుకార్యకర్తలు గజమాలతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం అలాగే నా గెలుపుకోసం కృషిచేసిన ప్రతి కార్యకర్తను గుర్తుపెట్టుకుంటానని, ఎవరికి ఏ సమస్య వచ్చిన పరిష్కరిస్తానని అలాగే మండల అభివృద్ధికి సంక్షేమ పతకాలతో పాటు మౌళిక వసులను కల్పించేందుకు కృషిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువనేత పుత్తా లక్ష్మిరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు గంగిరెడ్డి క్లస్టర్ ఇన్‌చార్జి కిషోర్‌రెడ్డి, షైన్స్ నాగమల్లారెడ్డి, చంద్రారెడ్డి, సురేంద్రరెడ్డి, ఓబుల్‌రెడ్డి, నాగభూషణ్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, అన్నమయ్య, రఘునాథ్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే విజయం మీదే

కమలాపురం రూరల్, జూలై 4 : ప్రతి విద్యార్థి కష్టపడి చదివితే విజయం మీదేనని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి అన్నారు. గురువారం మండలం పరిధిలోని పెద్దచెప్పలి గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పుత్తా మారుతీమోహన్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆయన తండ్రి పుత్తా ఎల్లారెడ్డి పదోతరగతిలో మండల స్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థినీ విద్యార్థులకు ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి, యువ నాయకుడు పుత్తా లక్ష్మిరెడ్డిల చేతుల మీదుగా ప్రోత్సాహక బహుమతులు అందించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చి కష్టపడి చదివితే విజయం మీదే అవుతుందన్నారు. ప్రతి విద్యార్థి పోటీతత్వంతో ఉండాలన్నారు. ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలను శ్రద్ధగా చదివి అర్థం చేసుకోవాలని ఒకవేళ అర్థంకాకపోతే తరగతిలో గదిలోనే మరోసారి ఉపాధ్యాయులను అడిగి అర్థమయ్యే విధంగా చెప్పించుకోవాలన్నారు. ప్రభుత్వపాఠశాలల్లో చదివే విద్యార్థులకు మరింత ప్రోత్సాహకాలు ఉంటాయన్నారు. పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, బ్యాగులు, షూ, యూనిఫాం ఇస్తున్నారన్నారు.

వేరుశనగ పంటల సస్యరక్షణ చర్యలు చేపట్టండి

వీరపునాయునిపల్లె, జూలై 4: వేరుశనగ పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి శ్యామ్‌బాబు సూచించారు. గురువారం మండలంలోని గోనుమాకులపల్లె, వీరపునాయునిపల్లె గ్రామాలల సాగలో ఉన్న వేరుశనగ పంటను ఆయన పరిశీలించారు. వేరుశనగ లద్దెపురుగు ఉధృతి ఎక్కువగా ఉందని, వీటి తల్లి పురుగులు లేత గుధుమ రంగులో ఉండి ఆకుసైన, అడుగు భాగాన నూగుతో కప్పిగుడ్లు పెడతాయన్నారు. పగటి వేళ ఈ పురుగులు చెట్ల అడుగు భాగాన లేక మట్టి పెల్లలు లేక గులక రాళ్ల అడుగున దాగి రాత్రిపూట మొక్కలను ఆశించి ఆకులను పూర్తిగా తినేస్తాయన్నారు. వీటినివారణకు థయోడికార్బ్ 200 గ్రాములు లేదా ఫ్లూబెండమైడ్ 40మి.లీ. మందును 200లీటర్ల నీటిలో కలిపిపిచికారీ చేయాలన్నారు. అలాగే విత్తిన 20-25 రోజులపుడు గొర్రుతో అంతకృషి చేస కలుపును నివారించుకోవాలని తెలిపారు.



రైతులతో మాట్లాడుతున్న ఏఓ శ్యామ్‌బాబు

'బెటాలియన్‌ను తరలించే పద్ధతికి స్వస్తి పలకండి'

కడప (మారుతీనగర్), జూలై 4: కడపలో గల 30 ఆంధ్రా ఎన్‌సీసీ బెటాలియన్‌ను తిరుపతికి తరలించే పద్ధతికి సంబంధిత అధికారులు వెంటనే స్వస్తి పలకాలని, లేని పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని సీనియర్ ఎన్‌సీసీ క్యాడెట్స్ అశోక్, కాశి హెచ్చరించారు. ఇందుకు నిరసనగా గురువారం కడప కలెక్టరేట్ ఎదుట నిరసన ధర్నా నిర్వహించి మాట్లాడారు. ఎవరో ప్రయివేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు, అధికారులు చేసిన తప్పులకు బెటాలియన్‌ను కడప నుండి తిరుపతికి తరలించాలనుకోవడం సరైందికాదన్నారు. దీంతో ఇక్కడి విద్యార్థులు తీవ్రంగా నష్టపోవాల్సివస్తుందన్నారు. కావున తక్షణమే తరలించే ప్రక్రియను మానుకోవాలన్నారు. ఇదిలా వుండగా గత ఫిబ్రవరిలో నిర్వహించిన ఎ.బి.సి. సర్టిఫికెట్ల తాలూకు ఫలితాలను వెంటనే విడుదల చేసి ఎన్‌సీసీ ప్రవేశాలు చేపట్టాలని డిమాండ్ చేశారు నిరసన కార్యక్రమం అనంతరం డిఆర్ఓను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

మైనర్లకు బైక్‌లు ఇస్తే ప్రమాదాలు తప్పవు

కడప(కలెక్టరేట్), జూలై 4: మైనర్లకు బైక్‌లు ఇస్తే ప్రమాదాలు తప్పవని యూత్ కాంగ్రెస్ ఆర్‌టిఐ జిల్లా ఛైర్మన్ మామిళ్ల నరసింహులు(చంటి) గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే మైనర్లు మోటారు బైక్‌లు నడిపి రోడ్డు ప్రమాదాలలో ప్రాణాలు కోల్పోయి, ఆ తల్లి దండ్రులకు కన్నీటి శోకం మిగుల్చుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తే ప్రమాదాలను అదుపు చేయవచ్చన్నారు.

వలంటీర్ల వ్యవస్థను కొనసాగించాలి

జమ్మలమడుగు, జూలై 4: ప్రజలకు అందుబాటులో ఉండి వారి సంక్షేమం గురించి పనిచేస్తున్న వలంటీర్ల వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం కొనసాగించాలని ఏఐటీయూసీ పట్టణ ఉపాధ్యక్షుడు మిడతూరి ప్రసాద్ కోరారు. గురువారం జమ్మలమడుగులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగం పెరిగిపోయిందన్నారు. వలంటీర్ల వ్యవస్థను రద్దు చేస్తే పరిస్థితి మరింత దయనీయంగా మారుతుందని తక్షణమే వారిని విధుల్లోకి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కరోనా సమయంలో, సంక్షేమ పథకాలు అందించడంలో వారి కృషి కీలకమైందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నాణ్యమైన ఎరువులు, విత్తనాలను అమ్మాలి

కమలాపురం రూరల్, జూలై 4:రైతులకు నాణ్యమైన అనుమతి ఉన్న విత్తనాలు, ఎరువులను మాత్రమే అమ్మాలని కడప ఇన్‌ఛార్జ్ సహాయ వ్యవసాయ సంచాలకులు సురేష్ రెడ్డి తెలిపారు. గురువారం కమలాపురం మండలంలోని ఎరువులు విత్తనాలు పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమలాపురం మండలంలోని విత్తనాలు, ఎరువులు మరియు పురుగుమందుల దుకాణదారులు రైతులకు నాణ్యమైన మరియు అనుమతి ఉన్న విత్తనాలు, ఎరువులు పురుగుమందులు మాత్రమే అమ్మాలని తెలిపారు. మండలంలోని ప్రతి దుకాణదారుడు నిబంధనలకు లోబడి ఉండాలన్నారు. ఎమ్మార్పీ ధరలకు మాత్రమే అమ్మాలన్నారు. రైతులు తప్పనిసరిగా రశీదులు పొందాలన్నారు. అనంతరం పలు రికార్డులు పరిశీలించి డీలర్లకు తగు సలహాలు ఇవ్వడం జరిగింది.



ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న సురేష్‌రెడ్డి

సేంద్రియ సాగుపై దృష్టి పెట్టాలి

సీకేదిన్నె, జూలై 4: రైతులు సేంద్రియ సాగుపై దృష్టి పెట్టాలని నవభారత్ ఫెర్టిలైజర్స్ మేనేజర్ క్రిష్ణమూర్తి తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం నరసన్నపల్లె, బుసిరెడ్డిపల్లె, గోపాలపురం, కమ్మవారిపల్లె, రసూల్‌పల్లె గ్రామాల్లో రైతులకు సేంద్రియ ఎరువును వాడకంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు పంటల సాగులో ఎరువులు అధికంగా వాడడం వలన ఆహార ఉత్పత్తులు విషతుల్యం అవుతున్నాయని, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ సాగును పెంచాలన్నారు. సేంద్రియ జీవన ఎరువులు వాడటం వలన పెట్టుబడులు తగ్గి అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు.

నిబంధనల ప్రకారం విక్రయాలు జరపాలి

పెండ్లిమర్రి, జూలై 4: ప్రభుత్వం నిర్దేశించిన మేరకుమాత్రమే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు విక్రయించాలని సహాయ వ్యవసాయ సంచాలకులు మురళీధర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల దుకాణాలను మండలవ్యవసాయాధికారి ఓబులేసుతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్లు, బిల్‌బుక్కులు, ఇన్వాయిస్‌లు తనిఖీ చేశారు. నిబంధనలు పాటించని డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హిందూపూర్ నుంచి అమరావతికి...

పులివెందుల టౌన్, జూలై 4: ఇచ్చిన మాట ప్రకారం అంబేద్కర్ విదేశీ విద్య పథకం అమలుకు సంతకం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ధన్యవాదాలు తెలిపేందుకు హిందూపురంకు చెందిన మక్బుల్‌జాన్ అనే మహిళ సొంత ఊరి నుంచి అమరావతి యాత్ర చేపట్టారు. గురువారం పులివెందులకు వచ్చిన ఆమె మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాల నుంచి విదేశీ విద్య స్కాలర్‌షిప్ కోసం పోరాటాలు చేస్తూనే ఉన్నానన్నారు. కానీ వైసీపీ ప్రభుత్వం ర్యాలీలు, ఆమరణ దీక్షలు, నిరసనలు తెలిపినా పట్టించుకోలేదన్నారు. చివరికు కిడ్నీ అమ్ముకునేందుకు రాష్ట్రపతికి, గవర్నర్‌కు, సుప్రీం కోర్టు, హైకోర్టు జడ్జికి, ముఖ్యమంత్రికి లేఖ రాసినా పర్మిషన్ ఇవ్వలేదన్నారు. గతంలో విద్యార్థులు విదేశాల్లో చాలా ఇబ్బందులు పడ్డారన్నారు. మా బాధలను చంద్రబాబునాయుడుకు, పవన్‌కళ్యాణ్‌కు, నారాలోకేష్‌కు తెలియజేశామన్నారు. ప్రభుత్వం ఏర్పడగానే విద్యార్థులకు న్యాయం చే స్తామని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం అంబేద్కర్ విదేశీ విద్య స్కాలర్‌షిప్ అని పేరుపెట్టారన్నారు. ముందు ఏ విధంగా ఉందో అదేవిధంగా కొనసాగిస్తారని మంత్రి ఫరూక్ కూడా సంతకం పెట్టారన్నారు. దీంతో మా సమస్యలను తీర్చిన సీఎం చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు, మంత్రి లోకేష్‌కు ధన్యవాదాలు తెలిపేందుకు వెళ్తున్నానన్నారు.



మాట్లాడుతున్న మక్బుల్ జాన్

విద్యార్థులను పరామర్శించిన ఎమ్మెల్యే మాధవి

కడప (ఎడ్యుకేషన్), జూలై 4 : కడప నగరం అక్కాయపల్లెలోని ఓ ప్రైవేటు విద్యాసంస్థలో పెచ్చులూడి గాయపడిన విద్యార్థులను కడప ఎమ్మెల్యే మాధవి పరామర్శించారు.గురువారం విద్యార్థుల గృహానికి వెళ్లి వారి క్షేమ సమాచారం అడిగి తెలుసుకున్నారు.



విద్యార్థిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మాధవి

7న అజ్మత్‌ఏ మొహరం అల్‌హరాం సమావేశం

కడప (ఎడ్యుకేషన్), జూలై 4 : అజ్మత్ ఏ మొహరం అల్‌హరాం సమావేశం ఈ నెల 7న మౌలానా సయ్యద్ దావూద్‌బాషా ఫాక్వి సాహెబ్ అధ్యక్షతన ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ముఖ్య అతిథిగా బెంగళూరు నుంచి మౌలానా పీఎం ముజామిల్‌సాహెబ్ రషీద్ హాజరవుతారన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన అవసరం



ఖాజీపేట సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ శ్రీదేవి - ప్రొద్దుటూరులో హాజరైన మహిళా సంరక్షణ కార్యకర్తలు

ప్రొద్దుటూరు టౌన్, జూలై 4: కేంద్రప్రభుత్వం రూపొందించిన కొత్త చట్టాలపై ఉద్యోగులు అవగాహన కలిగి ఉండాలని బాలల సంరక్షణ సమితి జిల్లా కౌన్సిలర్ సునీత పేర్కొన్నారు. గురువారం స్త్రీశక్తి భవనంలో కొత్త చట్టాలపై మహిళా సంరక్షణ కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణలో ఆమె మాట్లాడుతూ బ్రిటీష్ కాలం నుంచి అమలవుతున్న వలస చట్టాల స్థానంలో ప్రభుత్వం దేశ కాల పరిస్థితులకు అనుగుణంగా కొత్త చట్టాలను తెచ్చిందన్నారు. నూతన చట్టాలపై అవగాహన కల్పించేందుకు వంద రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నారని, దీనిలో భాగంగా ఉద్యోగులకు శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నూతన చట్టాల్లో మహిళలు, చిన్నారుల రక్షణ, హక్కులకు ఎక్కువ ప్రాధాన్యత ఉందన్నారు. బాధితులు జీరో ఎఫ్ఐఆర్ ద్వారా ఎక్కడైనా ఫిర్యాదు చేయవచ్చని, ఫిర్యాదుపై మూడు రోజుల్లోపు చర్యలు తీసుకుంటారన్నారు. ఆన్‌లైన్‌లోనే గెజిటెడ్ అధికారి సమక్షంలో వృద్ధులు, వ్యాధిగ్రస్థులు సాక్ష్యం చెప్పే అవకాశం కల్పించారని తెలిపారు. ఐసీపీ 1860, సీఆర్‌పీసీ 1973, ఇండియన్ ఎవిడెన్స్ యాక్టు 1872 వాటి స్థానంలో భారతీయ న్యాయ సంహిత్ 2023, భారతీయ నాగరికత సురక్ష సంహిత 2023 గురించి వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ అర్బన్ సీడీపీఓ హైమావతి, న్యాయవాది ఎం.కొండారెడ్డి, మహిళా సంరక్షణ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఖాజీపేట స్త్రీశక్తి భవనంలో....

ఖాజీపేట, జూలై 4: ప్రతి మహిళ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీడీపీఓ శ్రీదేవి అన్నారు. గురువారం స్త్రీశక్తి భవనంలో అంగన్వాడీ వర్కర్లకు, మహిళా పోలీసులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలన్నారు. మహిళలు అభివృద్ధి చెందాలంటే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు భారతి, జహదాబీ, శ్రీదేవి, రమాదేవి, మహిళా సంరక్ష కార్యదర్శులు, అంగన్వాడీ కార్యకర్తలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు ఎంపీడీఓ సభాభవనంలో....

బద్వేలుటౌన్, జూలై 4: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ రవి కుమార్, సీడీపీఓ శ్రీదేవి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సభాభవనంలో భారతీయ సంహిత చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అంగన్వాడీలకు, మహిళా పోలీసులకు, సూపర్‌వైజర్లకు సూచించారు. మహిళలకు, విద్యార్థినులకు సమాజంలో జరిగే నేరాలపట్ల అవగాహన కల్పించేలా అంగన్వాడీలు, మహిళా పోలీసులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ సుబ్బలక్షుమ్మ, ప్రతిరూప్, అరుణ, సువర్ణ, విజయ, సుగుణ, లక్ష్మి పాల్గొన్నారు.

వెలుగు కార్యాలయంలో....

కొండాపురం, జూలై 4: కేంద్రం అమలు చేస్తున్న మూడు కొత్త మహిళా చట్టాలపై గురువారం అధికారులు అవగాహన కల్పించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సచివాలయ, అంగన్‌వాడీ సిబ్బందికి అవగాహన కల్పించారు. సీడీపీఓ ముంతాజ్ బేగం, జిల్లా కౌన్సిలర్ మహేష్, హెడ్‌కానిస్టేబుల్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం

విఫలమైన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ● నీట్ పరీక్షను రాష్ట్రాలకే అప్పగించాలి ● కేంద్రంపై విరుచుకు పడిన విద్యార్థి సంఘాలు





వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద - జమ్మలమడుగు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు టౌన్, జూలై 4: నెట్, నీట్ పరీక్షల అక్రమాలకు నిరసనగా విద్యార్థి సంఘాలు చేపట్టిన బంద్ విజయవంతమైనట్లు ఆ సంఘాల నేతలు తెలిపారు. గురువారం దేశవ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, డీవైఎఫ్ఐ, ఆర్‌వీఎస్ ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ నిర్వహించారు. డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్‌రాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం రాష్ట్ర హక్కులను కాలరాసేలా ఏకీకృత విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. ఏకీకృత విధానంతో వాటి ప్రశ్నాపత్రాలు లీకై విద్యార్థులు ఆందోళన చెందుతున్నారన్నారు. నీట్ పరీక్ష రాసి నష్టపోయిన విద్యార్థులకు నష్టపరిహారం చెల్లించి కేంద్ర విద్యాశాఖమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణాధ్యక్షుడు అభిలాష్, కార్యదర్శి సురేష్, రాయలసీమ విద్యార్థి సంఘం కన్వీనర్ హరిత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాల నేతలు నిరసన

జమ్మలమడుగు, జూలై 4: దేశవ్యాప్తంగా విద్యాసంస్థలు బంద్‌లో భాగంగా పట్టణంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యాసంస్థలు బంద్ ప్రకటించారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై విద్యార్థి సంఘాలు భారత్ బంద్‌కు పిలుపునివ్వడంతో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ బాధ్యులు శివకుమార్, వినయ్‌కుమార్ దాసరి విజయ్ పాల్గొన్నారు. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ సంఘ నేతలు ప్రతి కళాశాల వద్ద విద్యార్థులను యాజమాన్యాలతో సంప్రదించి కళాశాలలను మూసివేయించారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర, బాలికల, జూనియర్ కళాశాలలు, పాత బస్టాండులోని గాంధీ విగ్రహం వద్ద తదితర చోట్ల నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు మూసివేయడంతో బంద్ విజయవంతమైంది.

ప్రజాసంఘాల ఆధ్వర్యంలో...

కొండాపురం, జూలై 4: ఐక్య విద్యార్థి సంఘాలు దేశవ్యాప్తంగా చేపట్టిన విద్యాసంస్థల బంద్‌కు మద్దతుగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బంద్ చేపట్టారు. పట్టణంలోని విద్యాసంస్థలను మూసివేయించారు. ఇటీవల నెట్,నీట్ పరీక్షలు నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని, కేంద్రం నిర్వహిస్తున్న పరీక్షల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని తదితర డిమాండ్లతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి మనోహర్‌బాబు, ప్రజాసంఘాల నాయకులు సుబ్బారావు,అరుణ్ కార్తీక్, డేవిడ్, ఖాదర్‌బాషా, ప్రసాద్, దినకర్ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో...

పోరుమామిళ్ల, జూలై 4: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యా సంస్థల బంద్ విజయవంతమైంది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల తరగతులను బహిష్కరించారు. ఎస్ఎఫ్ఐ నేత రవి మాట్లాడుతూ నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలను కేంద్రం ఇప్పటికైనా సిగ్గు వదలి సమగ్ర విచారణ జరిపి నిందితులపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నేతలు వంశీ, చారి, సుభాన్, హరి పాల్గొన్నారు.

లీకేజీలకు కారకులను శిక్షించాలి

మైదుకూరు రూరల్ జూలై4: నీట్, యూజీసీ నెట్ పరీక్షల లీకేజీలపై కారకులను శిక్షించాలని అఖిల భారత విద్యార్థి యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్, రాష్ట్ర కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు స్వచ్ఛందంగా బంద్‌ను ప్రకటించారు.

ప్రతిభను అమ్ముకునే స్థాయికి దిగజారింది

బద్వేలు, జూలై 4: ప్రతిభావంతులను అమ్ముకునే స్థాయికి కేంద్ర ప్రభుత్వం దిగజారిందని విద్యార్థి సంఘాలు ఆరోపించాయి. గురువారం బద్వేలులో చేపట్టిన బంద్ విజయవంతమైంది. ఆయా విద్యార్థి సంఘాల నేతలైన ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని, ఎస్ఎఫ్ఐ నేత రాజేంద్ర మాట్లాడుతూ దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ దేశ సహజ సంపదను కార్పొరేట్ పరం చేసి చివరకు విద్యార్థుల ప్రతిభను అమ్ముకునే స్థాయికి దిగజారిందన్నారు. నీట్ పరీక్ష అవకతకవకలపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని, ఇప్పటికైనా బీజేపీ తన వైఖరి మార్చుకోకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో జీఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఓబులేసు, ఎస్ఎస్‌యూఐ మామిళ్ల బాబు, పీఆర్ఎస్ఎఫ్‌వై జిల్లా కన్వీనర్ నాగేంద్రబాబు, ఆర్ఎస్‌యూ జిల్లా కార్యదర్శి చెన్నకేశవ, ఎస్ఎస్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ప్రసన్న కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'వలంటీర్ల వ్యవస్థను కొనసాగించాలి'

జమ్మలమడుగు, జూలై 4: ప్రజలకు అందుబాటులో ఉండి వారి సంక్షేమం గురించి పనిచేస్తున్న వలంటీర్ల వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం కొనసాగించాలని ఏఐటీయూసీ పట్టణ ఉపాధ్యక్షుడు మిడతూరి ప్రసాద్ కోరారు. గురువారం జమ్మలమడుగులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగం పెరిగిపోయిందన్నారు. వలంటీర్ల వ్యవస్థను రద్దు చేస్తే పరిస్థితి మరింత దయనీయంగా మారుతుందని తక్షణమే వారిని విధుల్లోకి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కరోనా సమయంలో, సంక్షేమ పథకాలు అందించడంలో వారి కృషి కీలకమైందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇంటిస్థలాలు ఇప్పిస్తాం : ఎమ్మెల్యే



ఎమ్మెల్యే నివాసంలో రేకలకుంట్ల నేతలు

బ్రహ్మంగారిమఠం, జూలై 4: రేకలకుంట్లలో నిరుపేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ హామీ ఇచ్చారు. గురువారం హైదరాబాదులోని ఎమ్మెల్యే నివాసంలో పుట్టా సుధాకర్‌యాదవ్‌ను రాష్ట్ర టీడీపీ నేత మాచుపల్లె రామచంద్రనాయుడు, మైదుకూరు మండల టీడీ పీ అధ్యక్షుడు భీమయ్య, జిల్లా బీసీ సెల్ నేత కిశోర్‌యాదవ్, రేకలకుంట యూనిట్ ఇన్‌చార్జ్ వెంకటేశ్‌నాయుడు భూతప్పనాయుడు, టీడీపీ నేతలు ఎమ్మెల్యే ను సన్మానించి ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యేతో రామచంద్రనాయుడు మాట్లాడుతూ మునకప్రాంతమైన రేకలకుంట పంచాయతీలో బ్రహ్మంసాగర్ ప్రాజెక్టు నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా ప్రతి ఇంటికీ నీరు అందించేందుకు గతంలో పుట్టా సుధాకర్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని మంజూరు చేయించినా వైసీపీ ప్రభుత్వం మూలన పడేసింది. దీంతో మైదుకూరు ఎమ్మెల్యేగా ఎన్నికైన పుట్టా సుధాకర్ ఇటీవల తిరిగి మంజూరు చేయించడంతో టీడీపీ నేతలందరూ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ టీడీపీ నేతలు గంజినాయుడు, ప్రతాప్ నాయుడు, ఎన్.ఓబయ్య, గురప్ప, కె.వెంకటేశ్, పుల్లారెడ్డి, ఎస్.చెన్నయ్య, మల్లయ్య, ఓ.ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి



అల్లూరి సీతారామరాజుకు నివాళులర్పిస్తున్న పోరుమామిళ్ల అటవీ అధికారులు

పోరుమామిళ్ల, జూలై 4: స్వాతంత్ర్య సమర యోధుడు బ్రిటీష్ దొరలను గడగడలాడించిన మన్యం దొర అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు అటవీ కార్యాలయంలో నిర్వహించారు. డీఎఫ్ఓ సందీప్‌రెడ్డి ఆదేశాలపై ఫారెస్టు రేంజర్ రఘునాథరెడ్డి అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్లు రమణ, రమణయ్య, సీనియర్ అసిస్టెంటు శ్రీనివాసులు, బీట్ ఆఫీసర్లు కరుణాకర్, రామాంజనేయులు, భారతి, మల్లికార్జున, డాగ్ స్క్వాడ్ హసన్‌బాషా పాల్గొన్నారు. వంగవీటిమోహనరంగ జయంతి సందర్భంగా బద్వేలు అసెంబ్లీ బీజేపీ కోకన్వీనరు పల్లెంశెట్టి పండరి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు బ్రెడ్లు పండ్లు పంపిణీ చేశారు. టీడీపీ నేతలు సీతా వెంకటసుబ్బయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పెన్షనర్స్ సంఘం ఆధ్వర్యంలో...

బద్వేలు రూరల్, జూలై 4: స్వాతంత్ర్య ఉద్యమంలో ఆంగ్లేయుల గుండెల్లో దడపుట్టించిన విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు అని పెన్షనర్స్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ మీనాక్షి రెడ్డి అన్నారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలోని పెన్షనర్స్ కార్యాలయంలో అల్లూరి జయంతి నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించిన ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో పోరాటపటిమ ప్రదర్శించి ఆంగ్లేయుల్లో భయం కలిగించి ప్రజల్లో ధైర్యాన్ని నింపిన విప్లవ వీరుడు అల్లూరిని భావితరాలు గుర్తుంచుకోవడం కర్తవ్యమన్నారు. పెన్షనర్స్ సంఘం గౌరవ సలహాదారులు గంజికుంట పుల్లయ్య, కార్యదర్శి కత్తి బ్రహ్మయ్య, కోశాధికారి గంగన్న, అర్గనైజింగ్ కార్యదర్శి పిచ్చయ్య, సుబ్బరాయుడు, నరసరాజు పాల్గొన్నారు.

నెల్లూరురోడ్డు, రాయల్ సర్కిల్ వద్ద...

బద్వేలుటౌన్, జులై 4: నెల్లూరురోడ్డు, రాయల్ సర్కిల్ వద్ద బలిజ కాపర్‌క్ ఆధ్వర్యంలో అల్లూరు సీతారామరాజు, వంగవీటి మోహనరంగ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. బలిజసంఘం నేతలు వెంకటేశ్వర్లు, రాగిమాను ప్రతాప్ కుమార్, వెంకటసుబ్బయ్య, పెరుగు వెంకటసుబ్బయ్య, బుజ్జి, కిషోర్ పాల్గొన్నారు.

అట్లూరులో...

అట్లూరు, జూలై 4: స్థానిక గ్రంథాలయంలో గురువారం అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. సీతారామరాజుకు విద్యార్థులు జేజేలు పలికారు. గ్రంథాలయాధికారి సుధాకర్, ఈటె మస్తాన్, నరసింహులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో....

మైదుకూరు రూరల్ జూలై4: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి ఆధ్యక్షతన అధ్యాపకులు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను రాష్ట్ర పండుగగా చేసుకుంటున్నామన్నారు. రామరాజు 27 ఏళ్లలోనే బ్రిటీష్ సైన్యానికి ఎదురు నిలబడి గుండెవిరచి ప్రాణ త్యాగం చేశారని గుర్తు చేశారు. బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన ఘనత అల్లూరి సీతారామరాజుకే దక్కుతుందని తెలిపారు.

రచయితల సంఘం ఆధ్వర్యంలో....

ప్రొద్దుటూరు టౌన్, జూలై 4: అల్లూరి సీతారామరాజు గొప్ప పోరాటయోధుడని రచయిల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని రామేశ్వరంలోని బాలబాలికల గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు రాజశేఖర్‌రాజు, శివశంకర్, గ్రంథాలయం రికార్డు అసిస్టెంట్ ఇబ్రహీంసాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అందుబాటులో ఉండాలి

గోపవరం, జూలై 4: అన్నిశాఖల అధికారులు ప్రజలకందుబాటులో ఉండి అభివృద్ధికి సహకరించాలని మండల ప్రత్యేక అధికారి నాగరాజు, ఎంపీడీఓ రాధాక్రిష్ణ, ఈఓపీఆర్‌డీ షేక్ హసీన తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం మండల సమావేశంలో వారు మాట్లాడుతూ అన్నిశాఖల అధికారులు సమన్వయం పాటించాలన్నారు. డయేరియా ప్రబలుతున్న నేపథ్యంలో అన్ని పాఠశాలలు, కళాశాలలు, హాస్టల్స్ అంగన్వాడీ కేంద్రాలు రెసిడెన్షియల్ పాఠశాలల్లో శుభ్రమైన తాగునీరు ఉండాలన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకుని వ్యక్తిగత శుభ్రత పాటించాలని, విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. సంతృప్తికర వర్షాల నేపథ్యంలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, గ్రామాల్లో విస్తృంగా పర్యటిస్తూ సాంకేతిక సలహాలు అన్నికాల సేవలు అందించాలన్నారు. పీఎం కిసాన్ 5 శాతం వెరిఫికేషన్ తరువాత త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. పొద్దుతిరుగుడు హైబ్రిడ్ విత్తనాలు, మినీ కిట్స్ మండలానికి 200, రెండు కిలోల ప్యాకెట్ల చొప్పున వంద శాతం సబ్సిడీపై పంపిణీ చేయాలన్నారు. ఉపాధి హామీ, ఉద్యానపంటల సాగుకు 36ఎకరాల లక్ష్యంగా పురోగతి సాధించాలన్నారు. నిర్మాణాల్లో ఉన్న పక్కాగృహాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

కర్నాటక టు తిరుమల పాదయాత్ర

● 22వ సారి నడచివెళుతున్న భక్తులు
● ఎర్రగుంట్లలో అల్పాహార విందు

ఎర్రగుంట్ల, జూలై 4: కర్నాటక రాష్ట్రం రాయచూరు జిల్లా సింధనూరు నుంచి తిరుమలకు 150మంది వెంకన్న భక్తులు పాదయాత్ర చేస్తూ వెళ్లారు. జూన్ 28న సింధనూరులోని శ్రీ లక్ష్మివేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి ఈ యాత్రను ప్రారంభించారు. రోజుకు 45 నుంచి 50కిలోమీటర్ల మేర వారు నడిచి గురువారం ఉదయం ఎర్రగుంట్ల చేరారు. వారికి కడప రోడ్డులో డాక్టర్ రామాంజనేయరెడ్డి అల్పాహార విందును ఏర్పాటు చేశారు. గోవిందనామాలు పలుకుతూ భజనలు చేసి భక్తి పారవశ్యాన్ని చాటారు. కలియుగ దైవం శ్రీవేంకటేశ్వర స్వామి కృపతో తాము వరుసగా 22వ సారి నడిచి తిరుమలకు చేరుతున్నట్లు గురుస్వామి పంపాపతి తెలిపారు. ఎర్రగుంట్లలో డాక్టర్ రామాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో తమకు మూడో ఏడాది అల్పాహారం ఏర్పాటు చేశారని వారికి కృతజ్ఞతలు తెలిపారు. 11న స్వామి వారిని దర్శించుకుని అదేరోజు సాయంత్రానికి తిరుగు ప్రయాణం సాగిస్తామన్నారు. వయో భారాన్ని కూడా లెక్కచేయకుండా వృద్ధులు, మహిళలు ఈ యాత్రలో పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా శ్మశానానికి రోడ్డు



స్వచ్ఛందంగా శ్మశానానికి రోడ్డు వేసుకుంటున్న గ్రామస్తులు

బి.కోడూరు, జూలై 4: వైసీపీ ప్రభుత్వంలో కాళ్లరిగేలా తిరిగినా శ్మశానానికి రోడ్డు వేయలేదని, టీడీపీ నేతలు దారి ఏర్పాటు చేశారని తంగేడుపల్లె వాసులు ఆనందం వెల్లడించారు. వైసీపీ ప్రభుత్వంలో శ్మశానానికి దారి లేదంటూ గ్రామస్తులంతా తహసీల్దారు కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా రోడ్డు ఏర్పాటు చేయలేదు. గ్రామంలో ఎవరైనా చనిపోతే పూడ్చేందుకు వెళ్లాలన్నా దారి లేక ఎన్నో అగచాట్లు పడ్డామని ఎవరూ కనికరించి దారి ఇవ్వలేదని తంగేడుపల్లె ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా గురువారం గ్రామంలోని టీడీపీ నేతలు మాకు (హరిజనవాడ) శ్మశానానికి దారి ఏర్పాటులో భాగంగా గ్రావెల్ తోలి రోడ్డు నిర్మాణం చేపట్టారని గ్రామస్తులు వారిని అభినందించారు. గోడి భాస్కర్‌రెడ్డి, రమణారెడ్డి మాట్లాడుతూ మా గ్రామంలో అందరితో మాట్లాడి ఎస్సీలకు శ్మశా నానికి దారి ఏర్పాటు చేశామనిచ, గ్రావెల్ తోలి రోడ్డు నిర్మాణం కూడా స్వచ్ఛందంగా వేయించామన్నారు. కార్యక్రమంలో శంకర్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ గోడి లక్ష్మి దేవి, పద్మనాభరెడ్డి, చెన్నక్రిష్ణారెడ్డి, స్థానిక ఎంపీటీసీ నరసింహారెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక విధానంపై ముఖ్యమంత్రికి అభినందనలు

ప్రొద్దుటూరు టౌన్, జూలై 4: నూతన ఇసుక విధానం అమలు చేయనున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు భవన నిర్మాణ కార్మిక నేతలు అభినందనలు తెలిపారు. పీఎస్ఆర్ ఫంక్షన్ హాలు వద్ద జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నిర్మాణదారులకు ఉచితంగా ఇసుక అందించనున్నట్లు సీఎం ప్రకటన హర్షణీయమన్నారు. గత సీఎం జగన్ భవన నిర్మాణ సంక్షేమ బోర్డు నిధులను దారి మళ్లించి కార్మికుల కడుపు కొట్టారని ఆగ్రహించారు. టీడీపీ వారైనా కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించి సంక్షేమ పథకాలు అందించాలని ఆయన కోరారు.

వసతిగృహాల్లో సౌకర్యాలు ఉండేలా చూడాలి

పోరుమామిళ్ల, జూలై 4: ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు అన్ని రకాల వసతి సౌకర్యాలు కల్పించాలని తహసీల్దారు శిరీషా, ఎంపీడీఓ వర ప్రసాద్‌రావు ఆదేశించారు. గురువారం ఎస్సీ బాలుర, ఎస్సీ బాలికల, గిరిజన గురుకుల సంక్షేమ వసతి గృహాలను తనిఖీ చేసిన వారు మాట్లాడుతూ 15రోజులకోసారి వాటర్ ట్యాంకులను శుభ్రపరచాలన్నారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్నారు. వైద్య పరీక్షలు చేయించాలని, ఎస్సీ బాలుర వసతిగృహం పాతబడి ఉండడంతో ఆ బిల్డింగునంతా పరిశీలించారు. వీటి మరమ్మత్తులు చేయించడం కానీ, లేదా కొత్త భవనం నిర్మించేందుకు ప్రభుత్వానికి నివేదిక పంపాలన్నారు. కార్యక్రమంలో వార్డెన్ బాలుడు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లపై తనిఖీ చేపట్టాలని వినతి

జమ్మలమడుగు, జూలై 4: నకిలీ దొంగ సర్టిఫికెట్లతో వికలాంగుల ముసుగులో పింఛన్లు పొందుతున్న వారిని పూర్తిగా విచారించి వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. 1వ తేదీ పింఛన్ల పంపిణీలో నకిలీ పింఛన్‌దారులు కొందరు తీసుకోలేదని తెలుస్తోంది. మైలవరం, పెద్దముడియం, జమ్మలమడుగు మండలాల్లో కొందరు గత ప్రభుత్వంలో ఒక్కొక్కరితో 25 నుంచి 40 వేల వరకు డబ్బు వసూలు చేసి వికలాంగ సర్టిఫికెట్లు తయారు చేయించి ఇచ్చినట్లుగా ఆరోపణలున్నాయి. అలాంటి వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. మున్సిపల్ 9వ వార్డులో ఇటీవల పింఛన్ పంపిణీకి ఇలాంటి సమస్యలు తలెత్తినట్లు తెలుస్తోంది. అర్హులు నేరుగా పింఛన్ కోసం వస్తారని, గతంలో వలంటీర్ల చేతివాటంతో ఇలాంటి సమస్యలు బయట పడకుండా పోయాయని బహిరంగ ఆరోపణలున్నాయి. ఈ సమస్యపై జమ్మలమడుగు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా అలాంటి సమస్యలేమైనా ఉంటే పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

బ్రహ్మంగారిమఠం, జూలై 4: కలెక్టరు ఉత్తర్వుల మేరకు మండలంలోని పలు పాఠశాలల్లో పరిసరాలు శుభ్రంగా ఉంచాలని, తాగునీరు, మధ్యాహ్న భోజనం విద్యార్థులకు నాణ్యంగా అందించాలని మండల ప్రత్యేక అధికారి నరసింహారెడ్డి సూచించారు. గురువారం గురుకుల పాఠశాల, బాలికల హాస్టల్‌ను తనిఖీ చేశారు. అనంతరం తాగునీటిని పాఠశాల ఆవరణను పరిశీలించారు. ప్రస్తుత సీజన్‌లో డయేరియా వచ్చే అవకాశాలు విద్యార్థులకు ఉందని జూలై, ఆగస్టు నెలల్లో ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండి విద్యార్థులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, హెల్త్ సిబ్బంది ఐసీడీఎస్ అధికారులతో సమావేశమయ్యారు.

సమయపాలన పాటించండి : ఎంఈఓ

కాశినాయన,జూలై4: ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ బోధనపై ప్రత్యేక దృష్టిపెట్టాలని ఎంఈఓ నిర్మల పేర్కొన్నారు. రెడ్డికొట్టాల, చెన్నవరం, కొండపేట గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, ఏపీ మోడల్ పాఠశాలను ఆమె సందర్శించారు. ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరును పరిశీలించారు. విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్య, నాణ్యమైన భోజనం అందించాలన్నారు.